తెలుగు జాతీయ దినపత్రిక
అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




హైదరాబాద్ | సంపుటి : 5 | సంచిక : 300 | ఎడిటర్ - డా. బి. అనిల్ కుమార్ | శుక్రవారం 15.05.2026 | పేజీలు : 12 | వెల : 6/-

## హైదరాబాద్‌పై గ్లోబల్ కంపెనీల ఫోకస్

### - భారీగా ఆఫీస్ లీజులు..!



హైదరాబాద్‌లో భారీగా విస్తరిస్తున్న గ్లోబల్ కంపెనీలు

9 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకున్న ఉబెర్

10 ఏళ్లకు అద్దె విలువ ఏకంగా ₹839 కోట్లు

ఇప్పటికే నెట్‌ఫ్లిక్స్, మెటా, యాపిల్ వంటి సంస్థల భారీ కార్యాలయాలు

2

తెలంగాణలో కార్యకలాపాలు పెంచేందుకు ఉబెర్ ఆసక్తి

### ఢిల్లీలో మరో దారుణం.. కదులుతున్న బస్సులో

# మహిళపై గ్యాంగ్‌రేప్

- ఢిల్లీ నాంగ్లోయ్‌లో కదులుతున్న బస్సులో మహిళపై గ్యాంగ్‌రేప్
- పని నుంచి ఇంటికి వెళ్తుండగా బాధితురాలిని బస్సులోకి లాగిన దుండగులు
- ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఇద్దరు నిందితుల అరెస్ట్
- అత్యాచారానికి ఉపయోగించిన ప్రైవేట్ బస్సును స్వాధీనం చేసుకున్న అధికారులు

విజేత, న్యూ ఢిల్లీ, మే 14 : దేశ రాజధాని ఢిల్లీలో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. నాంగ్లోయ్ ప్రాంతం లో కదులుతున్న ప్రైవేట్ బస్సులో ఒక మహిళపై సామూహిక అత్యాచారం జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. అత్యాచారానికి ఉపయోగించిన బస్సును కూడా స్వాధీనం చేసుకున్నట్లు గురువారం వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పితంపుర మురికివాడలో నివసించే బాధితురాలు మంగోల్‌పురిలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. మే 11న (సోమవారం) రాత్రి పని ముగించుకుని నడుచుకుంటూ ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో సరస్వతి విహార్ వద్ద ఆగి ఉన్న ఒక స్లీపర్ బస్సు డోర్ వద్ద నిలబడిన వ్యక్తిని ఆమె టైమెంత అని అడిగింది. వెంటనే అతడు, మరో వ్యక్తి



ఆమెను బలవంతంగా బస్సులోకి లాగారు. అనంతరం వారు బస్సును రాణి బాగ్ నుంచి నాంగ్లోయ్ వైపు తీసుకెళ్లి ఆమెపై ...

2

## ఫార్ములా ఈ-కార్ రేసు

### - కేటీఆర్ కు నోటీసులు

- కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు
- జూలై 31న విచారణకు హాజరు కావాలని ఆదేశం
- ఫార్ములా ఈ రేస్ కేసులో ఏ1గా కేటీఆర్



వివరాలు 2 లో..

## నీట్ పరీక్ష రద్దుపై రేవంత్ రెడ్డి స్పందన

- పేపర్ లీక్ తో నీట్ పరీక్ష రద్దు
- పారదర్శకమైన విచారణ జరపాలన్న రేవంత్ రెడ్డి
- పోటీ పరీక్షలు విద్యార్థుల జీవితాలను నాశనం చేయకూడదని వ్యాఖ్య

విజేత, హైదరాబాద్, మే 14 : నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు, పేపర్ లీక్ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంపై కేంద్రం పారదర్శకమైన విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్ష రద్దు నిర్ణయంతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఇలాంటి ఘటనలు పరీక్షల వ్యవస్థపై ఉన్న విశ్వసనీయతను దెబ్బతీస్తాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పేపర్ లీక్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని, విద్యార్థులు మళ్లీ ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణమే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. పోటీ పరీక్షలు అనేవి విద్యార్థుల ప్రతిభకు వేదిక కావాలి తప్ప, వారి జీవితాలను నాశనం చేసే సాధనాలుగా మారకూడదని ఆయన హితవు పలికారు. ఇదే సమయంలో ఆయన రాజకీయంగా కూడా విమర్శలు గుప్పించారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, పేపర్ లీక్ ఘటనల విషయంలో గత ప్రభుత్వ తీరు, ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ వైఖరి ఒకేలా ఉందంటూ రేవంత్ రెడ్డి చురకలు అంటించారు.



## ఇక ఫస్టియర్ లోనూ ప్రాక్టికల్స్

### - తెలంగాణ ఇంటర్ లో కీలక మార్పులు!

- విద్యార్థుల్లో ప్రాక్టికల్స్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా మార్పులు
- 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త విధానం అమలు
- ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్

2



### తెలంగాణలో కొత్త పార్కింగ్ పాలసీ..

## అడ్డగోలుగా పార్క్ చేస్తే వాహనం వేలానికే..!



2

- తెలంగాణలో కొత్త పార్కింగ్ పాలసీకి ప్రభుత్వ సన్నాహాలు
- అక్రమ పార్కింగ్ వాహనాలను స్వాధీనం చేసుకోనున్న అధికారులు
- టోయింగ్, పార్కింగ్ ఛార్జీలతో పాటు పాత చలాన్ల చెల్లింపు తప్పనిసరి
- నిర్ణీత గడువులోగా తీసుకోకపోతే వాహనాల వేలం
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రవాణా శాఖ ముసాయిదా రూపకల్పన

## కేరళ రాజకీయాల్లో ఉత్కంఠకు తెర నూతన సీఎంగా వీడీ సతీశన్ ఎంపిక

- కేరళ 13వ ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ ఎంపిక
- కాంగ్రెస్ పార్టీలో కొత్త తరానికి పట్టం కట్టిన అధిష్ఠానం
- పలువురు సీనియర్లను కాదని సతీశన్ వైపు మొగ్గు చూపిన రాహుల్ గాంధీ
- ప్రతిపక్ష నేతగా ప్రభుత్వ వ్యతిరేక పోరాటంతో గుర్తింపు
- వర్గ రాజకీయాలకు అతీతంగా ఎదగడం సతీశన్‌కు కలిసివచ్చిన అంశం

2



### ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్ల నియామకంపై

## సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- ఎంపిక కమిటీలో కేంద్ర కేబినెట్ మంత్రిని చేర్చడంపై ప్రశ్న
- సీబీఐ డైరెక్టర్ నియామక ప్యానెల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉంటారన్న జస్టిస్ దీపాంకర్ దత్తా
- ఈసీ కమిషనర్ల నియామక ప్రక్రియలో స్వతంత్ర సభ్యుడు ఎందుకు ఉండకూడదని ప్రశ్న



2

## మంత్రి సీతక్కకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విజ్ఞప్తి

- స్త్రీ నిధిలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలన్న కవిత
- స్త్రీనిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన ఎండీపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
- సంస్థను తన గుప్పెట్లో పెట్టుకోవడానికి ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశాడని ఆరోపణ

2



# హైదరాబాద్‌పై గ్లోబల్ కంపెనీల ఫోకస్..

## - భారీగా ఆఫీస్ లీజులు!

మొదటిపేజీ తరువాయి..
విజేత, హైదరాబాద్, మే 14 :
హైదరాబాద్ నగరం గ్లోబల్ కంపెనీలకు కీలకమైన వాణిజ్య కేంద్రంగా తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటోంది. ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ దిగ్గజాలు తమ కార్యకలాపాలను విస్తరించేందుకు భాగ్యనగరాన్ని ఎంచుకుంటున్నాయి. ఇటీవలి కాలంలో జరిగిన భారీ ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలే ఇందుకు నిదర్శనం. ఈ జాబితాలో తాజాగా రైడ్–హెయిలింగ్ దిగ్గజం ఉబెర్ కూడా చేరింది. ఏకంగా 9 లక్షల చదరపు అడుగులకు పైగా కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకుని, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ ట్రెండ్ కేవలం ఉబెర్‌కే పరిమితం కాలేదు. హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో అనేక బడా కంపెనీలు తమ కార్యాలయాలను ఏర్పాటు చేయడం లేదా విస్తరించడం చేశాయి.

**వీటిలో కొన్ని ముఖ్య ఒప్పందాలు ఇక్కడ ఉన్నాయి:**

| | |
|---|---|
| ఉబెర్: | మీనాక్షి ఎకో పార్కులో 9,01,115 చదరపు అడుగులు |
| నెట్‌ఫ్లిక్స్: | మాదాపూర్‌లోని ఐటీ పీహెచ్‌లో 41,435 చదరపు అడుగులు |
| ఫేస్‌బుక్ (మెటా): | హైటెక్ సిటీలో సుమారు 69,702 చదరపు అడుగులు |
| యాపిల్ : | ఇప్పటికే ఉన్న ఆఫీసుకు అదనంగా 57,000 చదరపు అడుగులు (మొత్తం 6.34 లక్షల చదరపు అడుగులు) |
| ఎగ్జిక్యూటివ్ సెంటర్: | 2.03 లక్షల చదరపు అడుగులు |

**ఉబెర్ భారీ ఒప్పందం వివరాలు**

ఉబెర్ ఇండియా సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, మీనాక్షి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ నుంచి మీనాక్షి ఎకో పార్క్ టవర్ 1లో ఈ భారీ స్థలాన్ని లీజుకు తీసుకుంది. ఈ ఒప్పందం జనవరి 9, 2026 నుంచి 10 సంవత్సరాల పాటు అమల్లో ఉంటుంది. దీని కోసం ఉబెర్ రాబోయే పదేళ్లలో సుమారు ₹839 కోట్లను అద్దె రూపంలో చెల్లించనుంది. నెలవారీ అద్దె సుమారు ₹5.86 కోట్లు కాగా, చదరపు అడుగుకు ₹65గా నిర్ణయించారు. దీని కోసం కంపెనీ ₹35.14 కోట్ల సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించింది. ప్రతి మూడేళ్లకు అద్దె 15% పెరిగేలా ఒప్పందం కుదిరింది.

**తెలంగాణలో విస్తరణకు ఉబెర్ ఆసక్తి**

ఇటీవల భారత్‌లో పర్యటిస్తున్న ఉబెర్ సీఈఓ దారా ఖోస్రోషాహి, మే 13న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని తమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఇక్కడ ప్రస్తుతం 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారు. భారత్‌లో, ముఖ్యంగా హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను పెంచాలని, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్ సిటీలో కార్పొరేట్ ఆఫీస్ ఏర్పాటు చేయడానికి కూడా ఉబెర్ ఆసక్తి చూపింది.

# తెలంగాణలో కొత్త పార్కింగ్ పాలసీ

## - అడ్డగోలుగా పార్క్ చేస్తే వాహనం వేలానికే!

మొదటిపేజీ తరువాయి..
విజేత, హైదరాబాద్, మే 14 :
తెలంగాణలో వాహనాల పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. రోడ్లపై అడ్డగోలుగా వాహనాలు నిలపడం, రోజుల తరబడి వదిలేయడం వంటి చర్యలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ కొత్త పార్కింగ్ పాలసీ ముసాయిదాను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రూపుదిద్దుకున్న ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, వాహనదారుల జేబుకు చిల్లు పడటమే కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వాహనాన్ని కోల్పోయే ప్రమాదం కూడా ఉంది.

ఈ ముసాయిదాలోని నిబంధనల ప్రకారం ఇకపై ఎక్కడపడితే అక్కడ వాహనాన్ని పార్క్ చేస్తే కేవలం జరిమానాతో వదిలిపెట్టరు. ట్రాఫిక్‌కు ఇబ్బందిగా, ఫుట్‌పాత్‌లపై, నో పార్కింగ్ జోన్లలో ఉన్న వాహనాలను అధికారులు వెంటనే టోయింగ్ చేసి స్వాధీనం చేసుకుంటారు. వాహన యజమాని తన బండిని తిరిగి పొందాలంటే టోయింగ్ ఛార్జీలు, వాహనాన్ని యార్డులో ఉంచినన్ని రోజులకు రోజువారీ పార్కింగ్ ఫీజు చెల్లించాలి. అంతేగాక ఆ వాహనంపై ఉన్న పెండింగ్ చలాన్లు, ఇతర జరిమానాలు మొత్తం చెల్లించిన తర్వాతే వాహనాన్ని అప్పగిస్తారు.

**గడువులోగా తీసుకోకపోతే వాహనాల వేలం**

ఈ కొత్త విధానంలో అత్యంత కీలకమైన అంశం వాహనాల వేలం. అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాన్ని నెల నుంచి 45 రోజుల్లోగా యజమాని క్లెయిమ్ చేసుకోకపోతే, ఆ వాహనాన్ని ప్రభుత్వపరం చేసి బహిరంగ వేలం వేసే అధికారం అధికారులకు ఉంటుంది. ఇలా స్వాధీనం చేసుకున్న వాహనాలను భద్రపరిచేందుకు పీపీపీ పద్ధతిలో ప్రత్యేక పార్కింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని కూడా రవాణా శాఖ ప్రతిపాదించింది.

**ప్రాంతాలను బట్టి ఈ ఛార్జీలు మార్పు**

నిర్బంధించిన వాహనాలకు విధించే రోజువారీ పార్కింగ్ ఫీజులను కూడా ముసాయిదాలో స్పష్టంగా పేర్కొన్నారు. ప్రాంతాలను బట్టి ఈ ఛార్జీలు మారతాయి. ద్విచక్ర వాహనానికి రోజుకు రూ.20 నుంచి రూ.30, ఆటోకు రూ.35 నుంచి రూ.50, కారుకు రూ.60 నుంచి రూ.80, బస్సు లేదా లారీకి రూ.200 నుంచి రూ.300 వరకు వసూలు చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం ముసాయిదా దశలో ఉన్న ఈ పాలసీని ప్రభుత్వం ఆమోదించిన తర్వాత ప్రజల నుంచి సూచనలు, అభ్యంతరాలు స్వీకరించి తుది మార్పులతో అమలు చేయనుంది.

# కేరళ రాజకీయాల్లో ఉత్కంఠకు తెర

## - నూతన సీఎంగా వీడీ సతీశన్ ఎంపిక

మొదటిపేజీ తరువాయి..
విజేత, హైదరాబాద్, మే 14 :
కేరళ రాజకీయాల్లో కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర 13వ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రతిపక్ష నేత వీడీ సతీశన్‌ను ఎంపిక చేస్తూ పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు దీప్‌దాస్ మున్షీ, ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్ ఈ ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో కేరళ కాంగ్రెస్‌లో ఒక తరం మారిపోయిందని, కొత్త శకం ఆరంభమైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

సీఎం రేసులో ఉన్న సీనియర్ నేత రమేశ్ చెన్నితాలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్వయంగా ఫోన్ చేసి, సతీశన్‌ను ఎంపిక చేసినట్లు తెలియజేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కూడా రాహుల్ సమావేశమై ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. రోజుల తరబడి సాగిన తీవ్రమైన లాబీయింగ్, చర్చల తర్వాత హైకమాండ్ సతీశన్ వైపే మొగ్గు చూపింది.



# ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్ల నియామకంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి..
ఎన్నికల కమిషనర్ల చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ మరియు ఎన్నికల కమిషనర్ల నియామకానికి ఏర్పాటు చేసిన ఎంపిక కమిటీలో కేంద్ర కేబినెట్ మంత్రిని చేర్చడం వెనుక ఉన్న హేతుబద్ధతను సుప్రీంకోర్టు ఈరోజు ప్రశ్నించింది. నియామక ప్రక్రియలో ప్రజాస్వామ్యం ఎక్కడ ఉందని కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, క్యాబినెట్ మంత్రితో కూడిన ప్యానెల్ ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్ల నియామకంపై నిర్ణయం తీసుకుంటుంది. నియామక ప్రక్రియపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ దీపాంకర్ దత్తా కీలక ప్రశ్నలు సంధించారు. సీబీఐ డైరెక్టర్ నియామక ప్యానెల్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా ఉంటున్నారని, ఎన్నికల సంఘం విషయంలో అలా ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. కనీసం స్వతంత్ర సభ్యుడు ఎందుకు ఉండకూడదని అటార్నీ జనరల్‌ను ప్రశ్నించారు. ప్రధానమంత్రి ఒక వ్యక్తిని నియమిస్తే, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు మరొకరిని నియమిస్తారని, అలాంటి సందర్భాలలో కేబినెట్ మంత్రిగా ఉన్నవారు ప్రతిపక్ష నాయకుడికి మద్దతు తెలిపే అవకాశం ఉంటుందా? అని ప్రశ్నించారు. ఆచరణలో అన్ని సందర్భాలలో అలా జరగకపోవచ్చని అటార్నీ జనరల్ సమాధానం ఇచ్చారు. ప్రధాని నిర్ణయాన్ని కేబినెట్ మంత్రి వ్యతిరేకించరని, అప్పుడు ప్రతిపక్ష నాయకుడు ఒక్కరే అవుతారని, దీంతో 2:1తో ప్రధాని సూచించిన వారు నియమించబడతారని జస్టిస్ దీపాంకర్ అన్నారు. ప్రతిపక్ష నాయకుడి పాత్ర కేవలం అలంకారప్రాయమే అని అభిప్రాయపడ్డారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పనిచేస్తున్నట్లు ప్రజలు భావించాలని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు.

# ఢిల్లీలో మరో దారుణం

## కదులుతున్న బస్సులో మహిళపై గ్యాంగ్‌రేప్

మొదటిపేజీ తరువాయి..
అత్యాచారానికి పాల్పడ్డారు. వివాహిత అయిన బాధితురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వైద్య పరీక్షల అనంతరం రాణి బాగ్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, మే 9న పశ్చిమ ఢిల్లీలోని జనక్‌పురిలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో మూడేళ్ల చిన్నారిపై 57 ఏళ్ల పాఠశాల సిబ్బంది అత్యాచారం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో కూడా నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

# ఫార్ములా ఈ-కార్ రేసు

## - కేటీఆర్ కు నోటీసులు

మొదటిపేజీ తరువాయి..
విజేత, హైదరాబాద్, మే 14 : ఫార్ములా ఈ–కార్ రేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఆయనతో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ3 హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావులకు సమన్లు జారీ అయ్యాయి. జూలై 31వ తేదీన విచారణకు హాజరు కావాలని ఏసీబీ కోర్టు అందులో పేర్కొంది. ఈ కేసులో కేటీఆర్ ఏ1గా ఉన్నారు. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ–కార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ చార్జ్‌షీట్‌లో పేర్కొంది.

# ఇక ఫస్టియర్ లోనూ ప్రాక్టికల్స్

## - తెలంగాణ ఇంటర్ లో కీలక మార్పులు!

మొదటిపేజీ తరువాయి..
విజేత, హైదరాబాద్, మే 14 : ఇంటర్ విద్యా విధానంలో కీలక మార్పులు చేపట్టేందుకు తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి సిద్ధమైంది. 2026–27 ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఫస్టియర్ నుంచి ప్రాక్టికల్స్, ఫైనల్ పరీక్షకు మార్కుల తగ్గింపు వంటి వివిధ మార్పులు చోటు చేసుకోనున్నాయి. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా మార్పులు చేసింది. ఇప్పటి వరకు ఇంటర్ సెకండియర్‌లో ప్రాక్టికల్స్ నిర్వహించేవారు. ఇక నుంచి ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్ ఉంటాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ విభాగాల్లో మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఫస్టియర్, సెకండియర్‌లలో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహణ ఉంటుంది. దీంతో విద్యార్థులు ఫస్టియర్‌లోనూ థియరీతో పాటు ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుంది. మ్యాథ్స్ బోధనలోనూ సంప్రదాయ పద్ధతికి భిన్నంగా, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను తీసుకురానుంది. దీని ద్వారా విద్యార్థులు సూత్రాలను సులభంగా అర్థం చేసుకోవడం, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపుందించుకోవడం, కాన్సెప్ట్ ఆధారిత విద్యను అభ్యసించడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మ్యాథ్స్‌లో 75 మార్కులకు ఫైనల్ పరీక్షలు ఉన్నాయి. ఈ మార్కులను 60కి తగ్గించే అవకాశముంది. మిగిలిన మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రాక్టికల్స్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ఆధారంగా మిగిలిన మార్కులను కేటాయించవచ్చని సమాచారం. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ వంటి భాషా విభాగాల్లో కూడా 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ కింద కేటాయించనుంది. సెమినార్లు, అసైన్‌మెంట్లు, క్లాస్ రూమ్ పనితీరు ఆధారంగా మార్కులు కేటాయించే అవకాశం ఉంది. ఈ కొత్త విధానం ద్వారా విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంతమేర తగ్గించే అవకాశం ఉందని విద్యావేత్తలు భావిస్తున్నారు. దీంతో కేవలం ఫైనల్ పరీక్ష ఆధారంగా మాత్రమే కాకుండా, సంవత్సరం పొడువునా విద్యార్థుల పనితీరును అంచనా వేసే విధానం అమల్లోకి వస్తుంది. విద్యర్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించే లక్ష్యంతో జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## మంత్రి సీతక్కకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి..
విజేత, హైదరాబాద్, మే 14 : మంత్రి సీతక్కకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక విజ్ఞప్తి చేశారు. ఆమె శాఖలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలని కోరారు. స్త్రీనిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ మేరకు కవిత 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పాటునివ్వాల్సిన స్త్రీనిధి సంస్థ అక్రమార్కులకు అడ్డంగా మారిందని ఆరోపించారు. సంస్థను తన గుప్పెట్లో పెట్టుకుని అనేక అక్రమాలకు కారకుడైన ఎండీ, ఇప్పుడు దొడ్డిదారిన సంస్థకు ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో ఈ నెల 16వ తేదీన స్త్రీనిధి ఉద్యోగుల సమావేశంలో ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పోస్టును తీసుకోవడానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని పేర్కొన్నారు. సదరు ఎండీ పదవీకాలం ఈ నెల 23వ తేదీతో ముగియనుందని, దీంతో ఆయన సంస్థను ఎలాగైనా తన అధీనంలోనే ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమార్కులను దొడ్డిదారిలో కీలక పోస్టుల కొనసాగించేందుకు ఎంతకైనా దిగజారుతోందని విమర్శించారు. తన శాఖలో జరుగుతున్న అక్రమాలపై మంత్రి సీతక్క స్పందించాలని కోరారు. స్త్రీ నిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్త్ర నిధిలో నియామకాలు పారదర్శకంగా జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

విజేత

రంగారెడ్డి

రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి

# ప్రజాసంక్షేమమే మల్ రెడ్డి లక్ష్యం

- తాగునీటి సౌకర్యాల కొరకు 24.90 లక్షల నిధులు మంజూరు
- మంచాల మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏర్పుల రాజు

విజేత, ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రజల సంక్షేమమే ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి లక్ష్యమని నియోజకవర్గ అభివృద్ధి కొరకు ప్రజల సంక్షేమం ఆయన సంకల్పం గొప్పది అని రంగారెడ్డి జిల్లా మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఏర్పుల రాజు అన్నారు. గురువారం ఆగపల్లి ప్రభుత్వ పాఠశాలలో నూతన బోర్ వేశారు నీరు పుష్కలంగా పడడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో డి.ఎం.ఎఫ్.టి నిధుల నుండి మంచాల మండలంలో నూతన బోర్ వెల్, నూతన మోటార్లు, పైప్ లైన్ తదితర తాగునీటి సౌకర్యాల కొరకు 24.90 లక్షల రూపాయల నిధులు మంజూరు కావడం జరిగిందని అన్నారు. మండలంలోని నోముల గ్రామానికి 4 లక్షలు, లోయపల్లి గ్రామానికి 5 లక్షలు, ఆంబోత్ తండా గ్రామానికి 3 లక్షలు, ఆరుట్ల గ్రామానికి 4 లక్షలు, సత్తి తండా గ్రామానికి 3.90 లక్షలు, ఆగపల్లి గ్రామానికి 5 లక్షలు గ్రామాలకు మంజూరు



కావడం జరిగిందని అన్నారు. ఎమ్మెల్యే సహకారంతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బద్దుల బాల్‌రాజు యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షులు సావత్ రాజు, ఉపాధ్యక్షులు పల్లే అనిల్ కుమార్, ప్రస్తుత వార్డు సభ్యులు ఎండి.సాజ్జాత్, నాయకులు మామిడికాయల శాంసన్, సావత్ రాజు, ఎండి.రాహీస్ దంటిక చంద్రయ్య, మంగళంపల్లి సురేందర్, ఆగపల్లి పంచాయతీ కార్యదర్శి అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పురాతన శ్రీచెన్నకేశవ స్వామి దేవాలయం కూల్చివేత ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారి

- మా గ్రామ దైవాన్ని కూలివేయడం బాధాకరం
- దళిత చైతన్య వేదిక (డీసీవీ) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఉక్కుల అశోక్

విజేత, ఇబ్రహీంపట్నం : గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను దెబ్బతీసే చర్యలు సమాజంలో విభేదాలకు దారితీస్తాయని, వెంటనే చింతపల్లి గూడ, ప్రగతి వెంచర్ లోని చెన్న కేశవ ఆలయాన్ని పునర్నిర్మించాలని దళిత చైతన్య వేదిక (డీసీవీ) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఉక్కుల అశోక్ డిమాండ్ చేశారు. శంషాబాద్ జోనల్, ఆదిభట్ల సర్కిల్, 54 వ కొంగర కలన్ డివిజన్ పరిధిలోని చింతపల్లి గూడ గ్రామంలోని ప్రగతి వెంచర్‌లో ఉన్న సుమారు 100 సంవత్సరాల పురాతన శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం కూల్చివేత ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. గ్రామస్థులు ఈ ఆలయాన్ని అత్యంత పవిత్రమైన దేవస్థానంగా భావిస్తూ తరతరాలుగా పూజలు నిర్వహిస్తూ వచ్చారు. కోరిన కోరికలు తీర్చే ఆలయంగా ఈ దేవాలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందని గ్రామ పెద్దలు తెలిపారు. అయితే వెంచర్ అభివృద్ధి, వ్యాపార అవసరాల పేరుతో కొంతకాలం క్రితం రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆలయాన్ని కూల్చివేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామ ప్రజల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వెంటనే ఆలయాన్ని పునర్నిర్మించాలని



వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ... “మా గ్రామ దైవాన్ని కూల్చివేయడం బాధాకరం. ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయాన్ని తిరిగి నిర్మించి భక్తుల విశ్వాసాన్ని కాపాడాలి” అని కోరారు. దేవాలయం కూల్చివేత ఘటనను ఉక్కుల అశోక్ తీవ్రంగా ఖండించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను దెబ్బతీసే చర్యలు సమాజంలో విభేదాలకు దారితీస్తాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# రాయపోల్ లో వైభవంగా హిందూ సమ్మేళనం

- శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణం.
- శ్రీపప్పు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం.

విజేత, ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో జరిగిన మహాసభలో భాగంగా ఉదయం 6 గంటలకు గ్రామ పురోహితులు శ్రీపప్పు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం తో ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఏడు గంటలకు హిందూ సమ్మేళన ఆహ్వాన సభ ప్రారంభమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి వారి ప్రసంగం ద్వారా అందరిని మంత్రముగ్ధున్ని చేసిన ప్రస్తుతం హనుమాన్ చాలీసా పారాయణ కర్త, అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంగం ప్రవీణ్ పవన్ దాస్ ప్రత్యేక ఆకర్షితులుగా నిలిచారు. అదేవిధంగా ముఖ్య వ్యక్తులుగా దిల్ సుఖ్ నగర్ బాగ్ బౌద్ధిక్ టోళీ సభ్యులు శ్రీరాం సుధాకర్, మహేశ్వరం బాగ్ సహ వ్యవస్థ ప్రముఖ్ చీర నరసింహ, ప్రసంగాలతో సభా ప్రాంగణం జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగిపోయింది. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన హిందూ బంధువులందరికీ సుమారు 2000 మందికి అన్నప్రసాద కార్యక్రమాన్ని క్రీ.శే నల్ల బుచ్చయ్య గౌడ్ జ్ఞాపకార్థం వారి





మనుమడు నల్ల రమేష్ గౌడ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు విద్యావేత్తలు, యువజన సంఘాలు మహిళలు, ఆధ్యాత్మిక బృందాలు పాల్గొన్నారు.

# విద్యార్థుల సర్వతోముకా అభివృద్ధికై ప్రభుత్వ పాఠశాలను బలపితం చేయాలి

విజేత, ఇబ్రహీంపట్నం : ప్రజాపాలన ప్రగతి విద్యా ప్రణాళిక వారోత్సవాలు భాగంగా గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ర్యాలీ ఆదిభట్లలో నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ వరకాల పరమేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బడిఈడు గల బాలబాలికలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వమే నూతనంగా 9 వస్తువులతో పాఠశాల విద్యార్థులకు కిట్టుతో పాటు బ్రేక్ ఫాస్ట్ సౌకర్యం కూడా కల్పిస్తున్నది అలాగే ఇంగ్లీష్ మీడియం, పాఠ్యపుస్తకాలు మరియు వర్క్ బుక్స్ ఉచిత నోట్ బుక్స్ ఉచిత దుస్తులు మధ్యాహ్న భోజనం, రాగి జావాతో పాటు విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు ఆటలు పాటలతో పాటు విద్యార్థుల సర్వతోముకా అభివృద్ధికై ప్రభుత్వ పాఠశాలను బలపితం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాషయ్య విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# నిరుద్యోగుల గర్జన... యుద్ధానికి సిద్ధం..



విజేత, హైదరాబాద్ : రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యపై యువత ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. మే 20న నిర్వహించనున్న నిరుద్యోగుల ఆవేదన సభ ను విజయవంతం చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ ముందు నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున సమావేశమై సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వెంటనే స్పందించి జూన్ 2లోగా రెండు లక్షల ఉద్యోగాలకు సంబంధించిన అన్ని శాఖల నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. ఉద్యోగాల కోసం సంవత్సరాలుగా సిద్ధమవుతున్న యువత తీవ్ర నిరాశలో ఉందని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా యువతలో అసంతృప్తి పెరుగుతోందన్నారు. మే 20న జరిగే నిరుద్యోగుల ఆవేదన సభకు తెలంగాణ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో నిరుద్యోగులు, విద్యార్థులు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యువత భవిష్యత్తుతో ఆటలాడొద్దని, వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి నిరుద్యోగులకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నిరుద్యోగ సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

**- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**



విజేత, ఇబ్రహీంపట్నం : వరి, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలంలో ఏర్పాటు చేసిన వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, లోడింగ్, లిఫ్టింగ్ తదితర పనుల పురోగతిని కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. లోడింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, అందుకు అవసరమైన లారీలు, హమాలీలను తగిన సంఖ్యలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కాంటా వేసి మిల్లులకు తరలించే చర్యలు చేపట్టాలన్నారు. రైతులు తమ పంటను విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. తేమ శాతం, నాణ్యత ప్రమాణాల పరిశీలనలో పారదర్శకత పాటించాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వివరాలు నమోదు చేసే రిజిస్టర్ పరిశీలించారు. వరి, మొక్కజొన్న నిల్వలో ఎటువంటి నష్టం జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యాన్ని భద్రపరిచేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన గన్ని బ్యాగులను, టార్పలిన్లను అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పర్యటనలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్, మార్క్ ఫెడ్ అధికారి, మండల వ్యవసాయ అధికారి, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

విజేత వరంగల్

వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్,
ములుగు, భూపాలపల్లి, జనగాం

# ధాన్యం కొనే నాథుడే లేడు

## - మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

విజేత, పర్వతగిరి : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే నాథుడే లేడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. ఈమేరకు గురువారం పర్వతగిరి మండలంలోని దౌలత్ నగర్ గ్రామంలోని రైస్ మిల్లును ఆయన పరిశీలించారు. అనంతరం రైతులు ఎర్రబెల్లి దయాకర్ రావు వద్ద తమ గోడును వెళ్లబోసుకున్నారు.ఆయన వెంటనే స్పందించి మార్క్ ఫెడ్ జీఎంతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. ఎన్నడు లేని విధంగా రైతులను ఇబ్బందులు పెట్టడం కాంగ్రెస్ పార్టీకి తగదని, ప్రభుత్వం మెడలు వంచైనా రైతుల పక్షాన ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ప్రతి గింజ కొనే వరకు పోరాడుతామని, ఎర్రటి ఎండలో రైతులను చూస్తే రేవంత్ రెడ్డి కి గోస అనిపిస్తా లేదా అని ప్రశ్నించారు. బోగస్ మాటలు, చిల్లర మాటలు మానుకొని రైతులు పండించిన మొక్కజొన్న, వరి కొనుగోలు పై శ్రద్ధ పెట్టాలని హితవు పలికారు. గన్నీ బస్తాల కొరతతో మొక్కజొన్న కొనుగోలు సరిగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రైతులకు విత్తనాలు, ఎరువులు ఇవ్వలేకపోతోందని మండిపడ్డారు. సకాలంలో రైతుబంధు ఇవ్వకపోగా.. కనీసం పండిన పంటను మద్దతు ధరకు కొనే పరిస్థితిలో కూడా లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. వారం రోజుల నుంచి పడిగాపులు కాస్తున్నామని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నా ఈ ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో 11 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పండితే సగం కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభం కాలేదని చ్పా. ప్రారంభం అయినవి కూడా



సరిగ్గా లారీలు లేక బస్తా సంచులేక రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నారని చెప్పారు. మద్దతు ధర రూ. 2,400 ఉంటే రూ. 1,600–1,800 కే అమ్ముకుని రైతులు మోసపోతున్నారని తెలిపారు. మొక్కజొన్న కొనుగోలుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఆరుగాలం కష్టపడ్డ రైతులు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకకు వెళ్లి సగం ధరకే అమ్ముకునే దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. వడ్లు కూడా రోడ్ల మీదనే ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి మక్కలు కొనుగోలు వేగవంతం చేసి రైతులని ఆదుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. సొసైటీ చైర్మన్ మనోజ్ గౌడ్, మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, ఏడుదొడ్ల జీతేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు బొట్ల మధు,మండల గ్రామ నాయకులు యూత్, సోషల్ మీడియా నాయకులు తదితరులు ఉన్నారు.

# పోలీస్ కమిషనర్ ని కలిసిన సామాజికవేత్త ఎల్ శ్రీనివాస్

విజేత వరంగల్ ప్రతినిధి : 25 సంవత్సరాల పరిచయంలో భాగంగా గురువారం రోజు మల్కాజిగిరి కమిషనర్ ఆఫ్ పోలీస్ బడుగుల సుమతిని క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసి భద్రకాళి అమ్మవారి ఫోటోను అందజేసిన సామాజికవేత్త సుస్మిత గార్డెన్ యజమాని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎల్ శ్రీనివాస్



# బాధిత కుటుంబాలకు పరామర్శ



విజేత, పర్వతగిరి : మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు చిరుత విజయ్ తండ్రి యాకయ్య ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధితుల నివాసానికి వెళ్లి యాకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని గడ్డపార తండాకు చెందిన భూక్య బాలు నాయక్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు . బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించి ధైర్యం చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ యం. మనోజ్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, ఏయంసీ మాజీ వైస్ చైర్మన్ ఏడుదొడ్ల జితేందర్ రెడ్డి, ఏయంసీ మాజీ డైరెక్టర్ బోయినపెల్లి యుగేందర్ రావు, సీనియర్ నాయకులు బొట్ల మధు, మసాని వెంకట్, భూక్యా రవి, ఎర్రబెల్లి కిషన్ రావు, వీరచారి, ముదురుకోళ్ల రాజు, దొమ్మటి రాజు, రంజిత్, చిన్నపాక శ్రీకాంత్, ఈరియా, గుగులోతు సుమన్, భూక్యా బాలు, భూక్యా వెంకన్న, భూక్యా వెంకటేష్, చిన్నపెల్లి అజయ్ తదితరులు ఉన్నారు.

# వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి



విజేత, పర్వతగిరి : మండలంలోని చింత నెక్కొండలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలుసుకొని సర్పంచ్ గాడుదుల రమేష్ యాదవ్, ఉప సర్పంచ్ పేరాల కవితదేవేంద్రావు ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఆస్పత్రిలో సదుపాయాల గురించి, మాట్లాడుతూ ఉపకేంద్ర వైద్యురాలు నవ్య కృష్ణతో పాటు ఆశ వర్కర్లను సమయ పాలన పాటించి హాస్పటల్ ను సాయంత్రం వరకు తెరిచి ఉంచాలని సూచించారు. అలాగే చికిత్స కోసం వచ్చిన ప్రజలకు తగు వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రాథమిక ఉప కేంద్రంలో సమయ పాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతాం

## - బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయుల ప్రచారం

విజేత, పర్వతగిరి : విద్యా వారోత్సవాల్లో భాగంగా గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతగిరి మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామ ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని జెడ్పీ ఉన్నత పాఠశాల పర్వతగిరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కందుకూరి నవీన్ కుమార్ కోరారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు పిల్లల చదువుల గురించి అనవసరమైన ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు . విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సంవత్సరం నుంచి ప్రభుత్వం 9 వస్తువులతో కూడిన ఉచిత కిట్ ను ప్రతి విద్యార్థికి అందిస్తుందని చెప్పారు . ఈ అవకాశాన్ని మండలంలోని తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కోరారు. సీనియర్ ఉపాధ్యాయులు పాక రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలో చదివే విద్యార్థులకు దీటుగా తయారు చేస్తామని భరోసా ఇచ్చారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నజియా సల్మా మాట్లాడుతూ .. తల్లిదండ్రులు లేని అమ్మాయిలను కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పర్వతగిరి లో చేర్పించాలని కోరారు. ఇంటర్ లో కూడా అమ్మాయిలకు అడ్మిషన్లు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# నీట్ పేపర్ లీకేజీలో బీజేపీ హస్తం..!

## - బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయుల ప్రచారం

విజేత, పర్వతగిరి : నీట్ పరీక్ష పేపర్ లీకేజీలో బీజేపీ పాత్ర ఉందని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నరసయ్య, ఆర్ఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లందాస్ కుమార్ ఆరోపించారు. దేశవ్యాప్తంగా 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో పడిందని, ఈ వ్యవహారంలో బీజేపీ పెద్దల హస్తము ఉందని ఆరోపించారు.డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఉన్న రాజస్తాన్ , మహారాష్ట్ర రాష్ట్రాల్లో నీట్ పరీక్ష జరిగిన 43 గంటల్లోనే పేపర్ లీక్ అయిందని వివరించారు. దీంతో తెలంగాణలో 70 వేల మంది విద్యార్థులు నష్టపోయారని మండిపడ్డారు. లీక్ ఘటనలో కేంద్ర ప్రభుత్వంలోని బీజేపీ పెద్దల పాత్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు.ఇంటర్మీడియట్ ఫలితాల విడుదల లో జరిగిన తప్పిదాలతో అప్పట్లో 29 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని వారు గుర్తు చేశారు. నీట్ పరీక్ష లీక్ వల్ల నష్టపోయిన విద్యార్థులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని



వారు డిమాండ్ చేశారు.

# బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

విజేత, గణపురం: గణపురం మండలంప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నేడు గణ పురం గ్రామ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ చేతుల మీదుగా బడిబాట ర్యాలీ కార్యక్రమం ఎంపీపీ ఎస్ గణపురం పాఠశాలలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలోని బడి ఈడు కలిగిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరనైనది. ఈ సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ బడీ ఈడు కలిగిన పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించే విధంగా నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. పదవ తరగతి జడ్.పి.హెచ్.ఎస్ గణపురం పాఠశాల నుండి అత్యధిక మార్కులు సాధించిన ఎండి పాహిమాను సర్పంచ్ చేతుల మీదుగా సన్మానించడం జరిగింది.ఈ సమావేశంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కే జలంధర్ ,డి చంద్రమౌళి, ఎం శ్రీధర్, ఏ ఏ పీసీ చైర్మన్ దూడపాక రజిత పాల్గొన్నారు.





# కరీంనగర్ సిట్ కు బండి భగీరథ లేఖ

## - బాలిక మైనర్ కాదు మేజర్ అంటూ భగీరథ పిటిషన్



విజేత, కరీంనగర్ ప్రతినిధి : ఫోక్సో కేసులో సిట్ బి విచారణకు హాజరు కావలసిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఎల్లుండి ఆధారాలతో సహా విచారణకు హాజరవుతానని పోలీసులకు లేఖ రాశారు నిన్న మధ్యాహ్నం రెండు గంటలకు విచారణకు రావాలని సెట్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఆయన ఈ లేఖ ద్వారా తన హాజరును ధ్రువీకరించారు కీలక ఆధారాలు సమర్పించి విచారణకు సహకరి స్తానని భగీరథ లేఖలో పేర్కొన్నారు అత్యాచారం బాధితురాలు మైనర్ బాలికను మేజర్ గా చూపించేందుకు బండి భగీరథ పిటిషన్ దాఖలు చేశారు ఈ విషయంలో టెన్త్ సర్టిఫికెట్ లోని వయస్సుని ప్రమాణికంగా తీసుకోవాలని గతంలో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని పిటిషన్ లో పేర్కొన్నారు సర్టిఫికెట్ వయసు నిర్ధారణకు ప్రామాణికం అని సుప్రీంకోర్టు గతంలో తెలిపింది.ఈ నేపథ్యంలో బాలిక మైనర్ కాదని మేజర్ అని వాదించేందుకు బండి భగీరథ ప్రయత్నిస్తు న్నట్లు తెలుస్తోంది.

# గన్ని బ్యాగుల కొరతతో రైతుల ధర్నా

## సీఈఓ తిరుపతిరెడ్డి బ్యాగులు పక్కకు మళ్లిస్తున్నారని ఆరోపణ



విజేత చొప్పదండి : చొప్పదండి పట్టణంలో ఫ్యాక్స్ సెంటర్లో 20 రోజుల నుండిగన్ని బ్యాగుల కొరతతో ధాన్యం కొనుగోళ్లుఆలస్యమ వుతున్నాయని ఆరోపిస్తూ రైతులు రోడ్డుపై బైఠాయించిధర్నానిర్వహిం చారు. సహకార సంఘాల సీఈఓ తిరుపతిరెడ్డి గన్ని బ్యాగులను పక్కకు మళ్లిస్తున్నారని రైతులు ఆరోపించారు. రైతులు గన్ని బ్యాగులు అడుగుతే లేవంటూనే ఆటోలలో ఇతర ప్రాంతాలకు పంపిస్తుండడంతో రైతులు ఆగ్రహం తో ఆటోలోని గన్ని బ్యాగులను రోడ్డుపై పరిచి వాటిపైనే కూర్చుని ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. బ్యాగుల కొరత కారణంగా పంటను కేంద్రాలకు తీసుకొచ్చినా కొనుగోలు చేయడం లేదని, దీంతో పంటలు ఎండలో పాడైపోతున్నాయని వర్షం వస్తే మమ్మల్ని ఆదుకునే వారెవారని రైతులు ఆవేదన వ్యక్తం

**రైతుల ఆరోపణలు :**

కొనుగోలు కేంద్రాలకు రావాల్సిన గన్ని బ్యాగులను సీఈఓ తిరుపతిరెడ్డి ఇతర ప్రాంతాలకు, వ్యాపారులకు మళ్లిస్తున్నారని రైతులు ఆరోపించారు. తక్షణమే తగినన్ని గన్ని బ్యాగులు సరఫరా చేసి కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ధర్నా కారణంగా రహదారిపై భారీ వాహనాలు, లారీలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.పోలీసులు, అధికారులు ఘటనాస్థలికి చేరుకొని రైతులతో మాట్లాడి రైతుల సమస్యను పరిష్కరించి తక్షణమే గన్ని బ్యాగులు అంది స్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు

# కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి 36 లక్షల రూపాయల వైద్య పరికరాలు



విజేత కరీంనగర్ ప్రతినిధి : జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి 36 లక్షల రూపాయల విలువైన అధునాతన వైద్య పరికరాలు అందాయి ప్రభుత్వం దాతల సహకారంతో ఐసీయూ బెడ్స్ వెంటిలేటర్స్ పేషెంట్ మానిటర్లు ఇతర అత్యవసర వైద్య సామాగ్రి సమకూరింది వీటితో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆసుపత్రి సూపర్డెంట్ తెలిపారు పేద రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యమని పరికరా లను వెంటనే అందుబాటులోకి తీసుకొస్తామని వైద్యాధికారులు పేర్కొన్నారు

# ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



విజేత, కరీంనగర్ : మల్యాల కొడిమ్యాల మండలాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామిడి శేఖర్ రెడ్డి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం ఘనంగా జరిగింది కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం ముఖ్యఅతిథిగా హాజరై నూతన గృహాన్ని ప్రారంభించారు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతయింటి కల నెరవేరుతోందని ఎమ్మెల్యే అన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు కార్యక ర్తలు పాల్గొని శేఖర్ రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు

# తెలంగాణలో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



విజేత, కరీంనగర్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెం టరీ పరీక్షల ప్రారంభమయ్యాయి ఈ పరీక్షల్లో భాగంగా నేడు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీషు పరీక్ష జరిగింది కరీంనగర్ తో సహా అన్ని పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని అధికారులు తెలిపారు



# ఉత్సాహంగా కొనసాగుతున్న క్రికెట్ కోచింగ్ క్యాంప్

విజేత, కరీంనగర్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జి ఎం కాలనీ గ్రౌండ్లో నెలరోజుల పాటు సమ్మర్ కోచింగ్ క్యాంపు ఉత్సాహంగా కొనసాగుతోంది ప్రత్యేక కోచ్ ల పర్యవేక్షణలో వందలాది మంది యువ క్రీడాకారులకు క్రికెట్ మెల కువలు నేర్పిస్తున్నారు ఈ క్యాంపులో శిక్షణ పొందిన క్రీడాకారు లు జిల్లా రాష్ట్ర అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు సిద్ధమవుతున్నారు . కొన్ని ఎళ్లుగా నిర్వహిస్తున్న ఈ శిబిరం ద్వారా ఎంతో మంది క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు

# విజేత కరీంనగర్

కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల

# కరీంనగర్ కొత్త డిఆర్డిఓ గా గీత బాధ్యతల స్వీకరణ



విజేత కరీంనగర్ ప్రతినిధి : కరీంనగర్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్గా ఎం గీతా నియమితుల య్యారు గతంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో డిప్యూటీ సీఈవోగా పనిచేసిన ఆమె పదోన్నతి పై ఇక్కడ బాధ్యతలు చేపట్టారు కరీంనగర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏసీబీ షాక్




విజేత కరీంనగర్ ప్రతినిధి : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అవినీతి అధికారులపై ఏసీబీ ఉక్కు పాదం మోపుతుందనే చెప్పాలి ఈ ఏడాది ఇప్పటివరకు 9 కేసులు నమోదు కాగా గతేడాది 27 కేసులు రికార్డు అయ్యాయి ముఖ్యంగా రెవెన్యూ రిజిస్ట్రేషన్ ఆర్టిఏ శాఖల్లో అవినీతిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి ఎసిపి డీఎస్పి విజయ్ కుమార్ దూకుడు పెంచడంతో లంచగొండి ఉద్యోగుల్లో వణుకు మొదలైంది ప్రభుత్వ కార్యాల యాల్లో పారదర్శకత పెంచేందుకు అధికారులు వరుస దాడులు నిర్వహిస్తున్నారు. ఇలాంటి స్టిక్ ఆఫీసర్స్ జిల్లాకు ఒకరు ఉండాలని ప్రజలు కోరుచున్నారు.

# ప్రశాంతంగా బక్రీద్ జరుపు కోవాలని కలెక్టర్ సూచన

## - బక్రీద్ ఏర్పాట్లపై ఎంఐఎం నేత గులాం అహ్మద్ విజ్ఞప్తి





విజేత కరీంనగర్ ప్రతినిధి : బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులతో సమీక్ష నిర్వహించారు విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సిపి గౌస్ ఆలం తెలిపారు నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు అధికారులు ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు.కరీంనగర్ జిల్లా అధికారులకు ఎంఐఎం అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ బక్రీద్ పండుగ ఘనంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో పశువుల సంతల్లో కుర్బానీ కోసం కొనుగోలు చేసే జంతువులకు వెటర్నరీ సర్టిఫికెట్లు అందుబాటులో ఉండేలా డాక్టర్లను నియమించాలని ఆవులను సంతల్లోకి తీసుకురాకుండా చెక్పోస్టులు ఏర్పాటు చేసే ఫ్లెక్సీల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు గోరక్షకుల ముసుగులో దాస్తీకా నికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విజేత
ఖమ్మం
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# కొర్కిశాల మోడల్/జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రారంభం

**- ప్రిన్సిపాల్ తాళ్లపల్లి రాకేష్**



విజేత, మొగుళ్ళపల్లి : పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులందరికీ కొర్కిశాలలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తాళ్లపల్లి రాకేష్ మంచి శుభవార్త తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని కొర్కిశాల గ్రామంలో గల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఈ మంచి సువర్ణవకాశాన్ని విద్యార్థినీ,విద్యార్థులందరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ మరియు ఏసీఈ గ్రూపులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని, ఒక్కో గ్రూపులో 40 సీట్లు ఉంటాయని, అర్హత కలిగిన విద్యార్థులంతా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన విద్యార్థులను కోరారు. కళాశాలలో ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుందని, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే విద్యాబోధన జరుపబడుతుందన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందించడం జరుగుతుందన్నారు. కళాశాల వరకు ఉచిత రవాణా సౌకర్యం కలదన్నారు. దరఖాస్తుల చివరి తేదీ మే 25, 2026 వరకు ఉందన్నారు. అప్లికేషన్ వెబ్సైట్ https://tgms.telangana.gov.in ద్వారా అప్లై చేసుకోవాలన్నారు. ఏటువంటి దరఖాస్తు ఫీజు లేదన్నారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు.

# ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

**- దర్యాప్తు ప్రారంభించిన ఎస్ఐ తిరుపతిరావు**



విజేత వెంకటాపురం, నూగురు : మధ్యాహ్నం సమయంలో వెంకటాపురం మండలం బెస్త గూడెం గ్రామంలోని మంచర్ల సంజీవరావు ఇంటి సమీపంలో బట్ట విద్యాసాగర్ వయసు 15 సంవత్సరాలు కులం బెస్తగూడెం గ్రామం వెంకటాపురం మండలం బట్ట విద్యాసాగర్ అనే వ్యక్తి ట్రాక్టర్ యొక్క ట్రాలీ నుండి ప్రమాదవశాత్తు కింద పడగా అతనికి ఛాతి పైన బలమైన గాయాలు అవ్వడంతో వెంకటాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో చనిపోవడం జరిగింది. సదరు ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తి అయినా తోకల మహేష్ ట్రాక్టర్ను మితిమీరిన వేగంతో నడపడం వల్ల విద్యాసాగర్ ట్రాక్టర్ ట్రాలీ నుంచి క్రింద పడి చనిపోవడం జరిగింది. సదరు తోకల మహేష్ పై మృతుడు తల్లి అయిన బట్ట సావిత్రి ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం అయినది.

# రైతులను ఆగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**- కాకర్లపల్లి కొనుగోలు కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర ఆగ్రహం**




విజేత, సత్తుపల్లి : ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరి, మొక్కజొన్న కొనుగోళ్లలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన మండిపడ్డారు.కొనుగోళ్లు ప్రారంభమైన 45 రోజుల తర్వాత ఇప్పుడు మంత్రులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం ప్రభుత్వం రైతుల పట్ల ఎంత చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందో అర్థమవుతోందన్నారు. కె. చంద్రశేఖర్ రావు హయాంలో కోతలకు ముందే సమీక్షలు నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి గింజ కొనుగోలు చేశారని గుర్తు చేశారు. కరోనా సమయంలో కూడా రైతులను ఆదుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు.ప్రభుత్వం కావాలనే కొనుగోళ్లు ఆలస్యం చేయడంతో రైతులు ప్రైవేట్ మిల్లర్లను ఆశ్రయించి ఆంధ్రప్రదేశ్లోని మండపేట, పెద్దాపురం ప్రాంతాలకు పచ్చి వడ్లు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు క్వింటాకు రూ.800 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.హమాలీలు లేక, బస్తాలు లేక, కొనుగోళ్లు సక్రమంగా జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతు భరోసా, రైతు బీమా అమలులో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో రాజకీయ జోక్యం పెరిగిపోయిందని, కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారికే బస్తాలు, కొనుగోళ్లు జరుగుతున్నాయని ఆరోపించారు.సత్తుపల్లి డివిజన్లో భారీగా ధాన్యం నిల్వలు ఉన్నప్పటికీ కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని, ప్రైవేట్ మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారని సండ్ర వెంకట వీరయ్య మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం తప్పుడు వైఖరిని విడనాడి మిగిలిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాకర్లపల్లి గ్రామ రైతులు, సత్తుపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రజా ప్రతినిధుల అభినందన




విజేత,సత్తుపల్లి : వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు2025-26 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలలో ప్రతిభ చూపగా మర్లపాడు గ్రామ సర్పంచ్ ఆంద్రయ్య వారిని సత్కరించారు. వివరాలలోకి వెళితే గత విద్యా సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు మార్చి నెలలో జరిగిన వార్షిక పరీక్షలలో విశేష ప్రతిభను చూపారు.వీరిలో బి.మన్విత 600 మార్కు లకు గాను 553 మార్కులు సాధించి వేంసూరు మండలంలో ద్వితీయ స్థాయిలో నిలవగా,మండల తృతీయ స్థానాన్ని 551 మార్కులతో పి.రుష్మిత కైవసం చేసుకుంది. తరువాత బి.యశస్విని 524 మార్కులు,కర్రి కీర్తన 514,కర్రి మౌనిక 512 మార్కులు పాఠశాల స్థాయిలో సాధించిన వారిలో ఉన్నారు.వీరికి భీమిరెడ్డి నారాయణ రెడ్డి, సుశీలమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు నగదు బహుమతులు అందచేశారు.అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను సమావేశంలో ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిధులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా పరంగా అందచేస్తున్న ఉచిత సదుపాయాలను వినియోగించుకుని విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్, తిరుపతిరావు, ఫకీర్, అనంద కుమార్, కరుణ లతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎలక్షన్ సమయం లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తా - కౌడగాని రాజేష్



విజేత, కమలాపూర్ : లక్ష్మి పూర్ గ్రామంలో ఏ మహిళ వివాహం జరిగిన ఐదు వేల రూపాయలు తన వంతుగా ఆర్థిక సహాయం చేస్తానని ఎలక్షన్ సమయంలో ఇచ్చిన హామీని ఇప్పటికీ నెరవేరుస్తూ ఆ గ్రామ సర్పంచ్ కౌడగాని రాజేష్ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆ గ్రామానికి చెందిన చెరిపెల్లి చంద్రమౌళి వనిత ల కూతురు అయిన అభిలాష వివాహనికి తాను ఐదు వెయ్యిల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా ఆ సర్పంచ్ కౌడగాని రాజేష్ మాట్లాడుతూ ఆడబిడ్డ ఏ ఇంటికి భారం కాదని లక్ష్మి పూర్ గ్రామంలో ఏ ఒక్క వ్యక్తి కి కష్టమొచ్చినా తాను ముందు ఉంటానని నేరెళ్ల గ్రామ అభివృద్ధి, గ్రామ ప్రజల సంక్షేమమే తనకు ముఖ్యమని ఆయన అన్నారు. కొంతమంది ఎలక్షన్ సమయంలో హామీలు ఇచ్చి మర్చిపోతారని తాను మాత్రం ఎలక్షన్ సమయంలో లక్ష్మి పూర్ గ్రామానికి గ్రామ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని గుర్తుంచుకొని నెరవేరుస్తారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈ వివాహానికి హాజరై మాట్లాడుతూ లక్ష్మి పూర్ గ్రామ సర్పంచ్ కౌడగాని రాజేష్ చేస్తున్న మంచి పనులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి పూర్ గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు కమలాపూర్ మండల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచేలా చర్యలు



విజేత, మొగుళ్ళపల్లి : రాబోవు వర్షాకాలం 2026 వ్యవసాయ సీజన్ లో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తెచ్చి..నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్లు మండల టాస్క్ ఫోర్స్ అధికారులు వ్యవసాయ శాఖ అధికారి పి సురేందర్ రెడ్డి, ఎస్ఐ ముప్పు సురేష్ లు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని విత్తన మరియు ఎరువులు, పురుగు మందుల విక్రయదారుల షాపుల్లో గురువారం వారు అకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. వచ్చే వర్షాకాలం సీజన్ లో పంటలు వేసే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే చర్యల్లో భాగంగా విత్తన నియంత్రణ మరియు చట్టాల అమలు కొరకు మండల స్థాయి టాస్క్ ఫోర్స్ టీం ఏర్పడిందని, ఆ టీంలో వ్యవసాయ శాఖ అధికారితో పాటు ఎస్ఐ ఉంటారని తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా పత్తి విత్తనాల లభ్యత మరియు నిల్వలు, ఎరువుల లభ్యత మరియు నిల్వలు, లైసెన్స్ వివరాలు, కొనుగోలు రసీదులు, అమ్మకపు బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ పట్టికలు, ధరల పట్టికలు మొదలగునవి పరిశీలించి తనిఖీలు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రతి విత్తన మరియు ఎరువులు, పురుగుమందుల డీలర్లు చట్టాలకు లోబడి విక్రయాలు జరపాలని సూచించారు. లేకుంటే చట్టంలో పొందుపరిచిన నియమాలననుసరించి చట్టరీత్య చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. డీలర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, లైసెన్స్ అందరికీ కనిపించే విధంగా ఎదురుగా పెట్టాలన్నారు. స్టాక్ రిజిస్టర్ మరియు బిల్లు బుక్కులపై వ్యవసాయ అధికారితో సర్టిఫై చేయించుకోవాలన్నారు. డీలర్లు తప్పనిసరిగా రైతు కొనుగోలు చేసిన సరుకులకు బిల్లులు/రశీదులు ఇవ్వాలన్నారు. బిల్లులపై తప్పనిసరిగా డీలర్ యొక్క లైసెన్స్ నెంబర్ వేయాలన్నారు. స్టాక్ బోర్డ్ అందరికీ కనిపించే విధంగా ఎదురుగా పెట్టాలని, రోజువారి నిల్వల వివరాలను బోర్డుపై రాయాలన్నారు. బ్లాక్ మార్కెటింగ్, ఎక్కువ ఎమ్మార్పీకి అమ్మితే లైసెన్స్ రద్దు చేయబడుతుందన్నారు. లైసెన్స్ లో పేర్కొన్న గోడౌన్ లో మాత్రమే సరుకును నిల్వ చేయాలని, లేనియెడల అనధికారికంగా పేర్కొని సరుకును స్వాధీనం చేసుకోవడం/సీజ్ చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సరుకును లెక్కపెట్టే విధంగా నిల్వ చేయాలని సూచించారు. డీలర్లు సరుకులను ప్యాకెట్ రూపంలో మాత్రమే అమ్మకం చేయాలని, లూజుగా అమ్మకం జరపరాదన్నారు. లైసెన్స్ లో పేర్కొన్న అడ్రస్ లో మాత్రమే అమ్మకం గానీ, నిల్వలు గానీ చేయాలన్నారు. డీలర్లు చట్టంలో పొందుపరిచిన విధంగా రికార్డులు, రిజిస్టర్లు, బిల్లులు విధిగా పాటించాలన్నారు. నకిలీ విత్తనాల భారీ నుండి రైతులను కాపాడేందుకే ప్రభుత్వం ఈ చర్యలను చేపట్టినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి పి సురేందర్ రెడ్డి, ఎస్ఐ ముప్పు సురేష్ లు తెలిపారు.

విజేత
మెదక్
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

## నూతన వస్త్రధారణ కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ నాగేష్ షేట్కార్

విజేత,కంగ్టి : కంగ్టి మండల దెగుల్‌వాడి గ్రామంలో బస్వారాజ్ కుమార్తె నూతన వస్త్రధారణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ నాగేష్ షేట్కార్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారికి ఆశీస్సులు అందించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు విద్యలో, సంస్కారంలో ముందుండి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు మరియు కుటుంబ సభ్యులు చైర్మన్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య సాగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, షార్ణప్ప, ప్యాక్స్ డైరెక్టర్ కుపేందర్ రెడ్డి, హన్మంత్, సంతోష్ రెడ్డి, నందు తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



## బండి సంజయ్ కుమారున్ని అరెస్ట్ చేయాలి

### - సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

విజేత, సంగారెడ్డి ప్రతినిధి : బండి భగీరథ్ పై ఫోక్సో కేసు నమోదు అయినప్పటికీ రాజకీయ వత్తిడికి పోలీసులు లొంగి అరెస్టు చేయడం లేదని, వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. గురువారంనాడు సంగారెడ్డి న్యూ బస్టాండ్ వద్ద మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేంద్ర హోమ్ శాఖా సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ.. భాద్యత కలిగిన స్థానంలో ఉన్న మంత్రి బండి సంజయ్ చట్టంపై గౌరవం ఉంచి తన కొడుకును అప్పగించాలని డిమాండ్ చేశారు. పైగా మంత్రి బండి సంజయ్ బెదిరింపులకు పాల్పడడాన్ని చూస్తే కేసును తారుమారు చేసే ప్రయత్నం జరుగుతుందని అన్నారు.కేంద్ర మంత్రి పదవికి బండి సంజయ్ రాజీనామా చేయాలని అన్నారు.బాధిత కుటుంబం కు న్యాయం చేయాలని ప్రభుత్వంను కోరారు. ఈ కార్యక్రమం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి సాయిలు, మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు ఎం యాదగిరి, నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు..




## వివాహ వేడుకల్లో పాల్గొన్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్



విజేత, సంగారెడ్డి ప్రతినిధి : ఇర్గిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ నాగన్న కుమారుని వివాహ వేడుకల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. JRK ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ వివాహ కార్యక్రమంలో వధూవరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం జర్నలిస్టు షౌకత్ అలీ కోడలు వివాహ వేడుకల్లో కూడా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు...ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి తదితరులు ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్నారు.

## పెళ్లి రోజు సందర్భంగా 12 వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమతను ఘనంగా సన్మానించిన మహిళలు

విజేత, సంగారెడ్డి ప్రతినిధి : సదాశివపేట పట్టణంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి మమత రాజు దంపతుల పెళ్లిరోజు వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా దంపతులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు స్వీకరించారు.పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పులిమామిడి మమత రాజు దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దంపతులు ఇలాగే ఆనందంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.వేడుకల్లో పాల్గొన్న అతిథులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేయగా, కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది. అభిమానులు పూలమాలలు వేసి దంపతులను సన్మానించారు. ఈ వేడుకలు స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



## ఎల్‌ఓసి చెక్కును అందజేసిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



విజేత, సంగారెడ్డి ప్రతినిధి : సదాశివపేట పట్టణానికి చెందిన బొడుగు స్వరూప అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (నిమ్స్)లో చికిత్స పొందుతున్నారు. చికిత్స ఖర్చుల కారణంగా కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు.బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారు రూ.1 లక్ష 25 వేల LOC ఆర్థిక సహాయం మంజూరుకు కృషి చేసి, సంబంధిత చెక్కును సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా స్వరూప కుటుంబ సభ్యులు తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో మాజీ CDC చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ జాఫర్ తదితరులు ఉన్నారు.

## పాపన్నపేట కేజీబీవీ అదనపు మౌలిక వసతుల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రోహిత్ రావు శంకుస్థాపన



విజేత, పాపన్నపేట : విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన పాపన్నపేటలో రూ. 42 లక్షలతో మంజూరైన కేజీబీవీ వసతుల అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట సర్పంచ్ లింగంపేట పావని నరేందర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ గౌడ్ స్థానిక నాయకులు, కెజిబివి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పాపన్నపేటలో నేడు గ్రంధాలయంలో పుస్తకప్రదర్శన - లైబ్రరీయన్ నరేందర్ రెడ్డి




విజేత, పాపన్నపేట : మండల కేంద్రమైన పాపన్నపేటలో శుక్రవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ ప్రభుత్వం – ప్రజాపాలన విద్యావారోత్సవాలలో భాగంగా లైబ్రెరీ డేను పురస్కరించుకుని పుస్తక ప్రదర్శన, దాతల ద్వారా పుస్తకాల సేకరణ నిర్వహిస్తున్నట్లు లైబ్రరీయన్ కె నరేందర్ రెడ్డి తెలిపారు. వక్తలచే పుస్తక పఠనం గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని, విద్యార్థులు,యువకులు, విద్యావేత్తలు అధిక సంఖ్య లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నరేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## వరుస మోటర్ సైకిల్ దొంగతనాలు చేస్తున్న దొంగ అరెస్ట్



విజేత, సంగారెడ్డి ప్రతినిధి : సంగారెడ్డి:–సదాశివపేట పట్టణ మరియు పరిసర ప్రాంతాలలో వరుసగా మోటార్ సైకిల్ దొంగతనాలు చేస్తున్నటువంటి వ్యక్తిని సదాశివపేట పోలీసులు పట్టుకొని అతడి నుంచి మూడు ద్విచక్రవాహనలను స్వాధీనం చేసుకున్నారు. సదాశివపేట పట్టణ ఇన్స్పెక్టర్ D. వెంకటేష్ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. నేరస్తుడు ఇఫ్షీతాబాద్ గ్రామానికి చెందిన బలరాం సంగమేశ్వర్ అను అతను జల్సాలకు, మద్యానికి అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకొని ఇదే నెలలో ఇఫ్షీతాబాద్ గ్రామంలో పల్సర్ బైక్, ఆత్మకూరు గ్రామంలో గ్లామర్ బైక్, సదాశివపేట పట్టణంలో స్ప్లెండర్ ప్లస్ బైక్ ని దొంగతనం చేసినట్లు పోలీసులు గుర్తించారు. అతని వద్ద నుండి మూడు బైకులను స్వాధీనం చేసుకొని నేరస్తుడిని రిమాండ్ కు తరలించినట్లు సదాశివపేట ఇన్స్పెక్టర్ డి.వెంకటేష్ తెలిపినారు. దొంగలను పట్టుకున్న ఐడి పార్టీ కానిస్టేబుల్ వెంకటేశం, అమానుల్లా, నహీద్ పాష, మల్లేశంను ఇన్స్పెక్టర్ అభినందించారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



విజేత,పాపన్నపేట జీవితంపై విరక్తి చెంది యాసిడ్ సేవించి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మల్లంపేట గ్రామంలో చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు...గ్రామానికి చెందిన కోట నారాయణ(58) గత కొన్ని రోజులుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు.పక్షవాతం కారణంగా ఏ పని చేసుకోలేక పోతున్నానని అంటూ తరచూ చనిపోతా కుటుంబీకులతో బాధపడుతుండేవాడు.ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన నారాయణ ఈనెల 10న రాత్రి సమయంలో ఇంట్లో ఉన్న యాసిడ్ సేవించి గట్టిగా అరవడంతో కుటుంబీకులు అడగడంతో యాసిడ్ సేవించానని తెలిపాడు.చికిత్స నిమిత్తం అతన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు.మృతుడి కొడుకు రాములు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

## నేడు శివంపేట శాఖ గ్రంధాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు!

### - గ్రంధాలయ పాలకురాలు డి.అర్చన..!!




విజేత,శివంపేట : శివంపేట మండల కేంద్రంలోని శాఖ గ్రంధాలయం లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మే 11 నుండి 17 వరకు విద్యా వారోత్సవాలు నిర్వహించడం జరిగిందని, మే 15న శివంపేటలోని శాఖ గ్రంధాలయం నందు గ్రంధాలయం దినోత్సవం మరియు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరుగుతుందని గ్రంథపాలకురాలు డి,అర్చన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంపిటేటివ్ ప్రిపేర్ అయ్యే విద్యార్థులు, పుస్తక ప్రియులు తదితరులు పాల్గొంటారని అన్నారు. ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా గ్రంథ పాలకురాలు డి, అర్చన విజ్ఞప్తి చేశారు.

విజేత నల్గొండ
నల్గొండ, సూర్యపేట, యాదాద్రి భువనగిరి

## గంధమళ్లలో ఆంజనేయ స్వామి విగ్రహం ధ్వంసం



విజేత, తుర్కపల్లి : తుర్కపల్లి మండలంలోని గంధమల్ల గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమంతుని విగ్రహాన్ని గుర్తుతెలియని దుం డగులు ధ్వంసం చేశారు.గురువారం ఉదయం 9 గంటల నుండి 10 గంటల ప్రాంతంలో కొందరు ఆగంతకులు హను మాన్ గుడిలో విధ్వంసం సృష్టించారని, గ్రామస్తులు, హిందూ సంఘాల నాయకులు తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేసి,మండిపడ్డారు.గ్రామాల్లో గుర్తుతెలియని కొందరు క్రిమినల్ గాళ్ళు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని,వాళ్ళను గుర్తించికఠినంగా శిక్షించాలని..హిందూ సంఘాల డిమాండ్ చేస్తూ తుర్కపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.హిందువులు అతి పవిత్రంగా పూజించే హనుమాన్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు.

## వీరనారి చాకలి ఐలమ్మ కుటుంబానికి అరుదైన గౌరవం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం

- తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలుగా చిట్యాల శ్వేత
- హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన రజక సంఘం మండల ఉపాధ్యక్షులు ఆంజనేయులు



విజేత గజ్వేల్ : దొరల భూస్వామ్య పాలనకు వ్యతిరేకంగా దున్నేవాడికే భూమి కావాలని భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసి అసువులు బాసిన వీరనారి చాకలి ఐలమ్మ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అరుదైన గౌరవం కల్పించింది.ఐలమ్మ ముని మనవరాలు చిట్యాల శ్వేత ఐలమ్మను తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిందనీ హర్షం వ్యక్తం చేసిన జగదేవపూర్ మండల రజక సంఘం ఉపాధ్యక్షులు ఆంజనేయులుఈ సందర్భంగా మండల రజక సంఘం ఉపాధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడుతూ మే 11, 2026న తెలంగాణ ప్రభుత్వం మహిళా కమిషన్‌ను పునర్వ్యవస్థీకరిస్తూ చిట్యాల శ్వేతను సభ్యురాలిగా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసిందనీ అన్నారు.చారిత్రాత్మక పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వారసురాలికి ఈ కీలక పదవి దక్కడం సామాజిక వర్గానికి, ముఖ్యంగా రజక సంఘాలకు గర్వకారణమని ఆంజనేయులు అభిప్రాయపడ్డారు.ఇప్పటి వరకు ఏ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించని ఐలమ్మ కుటుంబాన్ని రేవంత్ రెడ్డి సర్కార్ ప్రత్యేకంగా గుర్తించిందనీ పేర్కొన్నారు .మన హక్కుల పరిరక్షణలో ను వారి సమస్యల పరిష్కారంలోనూ వారు చురుకైన పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు భూమి కోసం భుక్తి కోసం పోరాడిన ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగిస్తూ ఆమె మనమరాలికి ఈ అవకాశం కల్పించడం సంతోషదాయకమని వారు తెలిపారు.

## రైతు రాజ్యం పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం - ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



విజేత గజ్వేల్ : పంటలు కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టడమే రైతు రాజ్యమా అంటూ ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయకపోవడం దురదృష్టకరమని ఆయన ఆరోపించారు.గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలను వెంటనే కొనుగోలు చేయడం జరిగేదని గుర్తు చేశారు. రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పథకాలు అమలు చేశారని అన్నారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రాజ్యం అని ప్రచారం చేసుకుంటూ రైతులను రోడ్డున పడేస్తోందని ఆయన మండిపడ్డారు.కొనుగోలు కేంద్రాలలో రైతులు తెచ్చిన పంట నిల్వ ఉండడంతో విత్తనాలు మొలకెత్తుతున్న పరిస్థితి ఏర్పడిందని గత రెండు నెలలుగా పొద్దుతిరుగుడు తదితర పంటలను కూడా కొనుగోలు చేయకుండా రైతులను నష్టాల పాలుచేస్తున్నారని విమర్శించారు. రైతుల కష్టాన్ని పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బీమా కళ్యాణ లక్ష్మి , కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలను కొనసాగించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డాక్టర్ యాదవ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేవలం మాటలకే పరిమితమైందని అన్నారు.అదే విధంగా గజ్వేల్ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని తెలిపారు. రైతులు ప్రజల సమస్యలపై వెంటనే స్పందించి కొనుగోళ్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## యూకేలోని సోలిహల్ కౌన్సిలర్‌గా డిండి గ్రామ వాసి హితేష్ బికుమల్ల ఎన్నిక

విజేత, నల్గొండ : నల్గొండ జిల్లా దిండి అనే చిన్న గ్రామానికి చెందిన హితేష్ బికుమల్ల పదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం ఉన్నత లక్ష్యాలతో 18 సంవత్సరాల క్రితం మాస్టర్స్ చదువుకోసం యునైటెడ్ కింగ్‌డమ్‌కు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. చదువుతో ప్రారంభమైన ఆయన ప్రయాణం ఇప్పుడు ప్రజా సేవ దిశగా సాగి విశేష విజయాన్ని అందుకుంది.యుకేలోని వెస్ట్ మిడ్‌లాండ్స్ ప్రాంతంలోని సోలిహల్ బరో పరిధిలో ఉన్న సిల్‌హిల్ వార్డ్ నుంచి కన్జర్వేటివ్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన హితేష్ బికుమల్ల తన తొలి ప్రయత్నంలోనే కౌన్సిలర్‌గా ఎన్నికై తెలుగు ప్రజలకు గర్వకారణంగా నిలిచారు.స్థానిక సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, రోడ్లు, శుభ్రత, కమ్యూనిటీ సేవలు, ప్రజా భద్రత వంటి అంశాలపై ప్రజలతో కలిసి పనిచేయడం ద్వారా హితేష్ స్థానిక ప్రజల విశ్వాసాన్ని సంపాదించారు. ఎన్నికల ప్రచారంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానిక కమ్యూనిటీ సభ్యులు చురుకుగా పాల్గొని ఆయన విజయానికి తోడ్పడ్డారు.ఒక చిన్న గ్రామం నుంచి ప్రారంభమైన ప్రయాణం అంతర్జాతీయ స్థాయిలో ప్రజా సేవకు దారి తీసిందని, తెలుగు మాధ్యమంలో చదివిన ఒక సాధారణ విద్యార్థి యునైటెడ్ కింగ్‌డమ్‌లో కౌన్సిలర్ స్థాయికి ఎదగడం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు ఈ సందర్భంగా తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హితేష్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా సిల్‌హిల్ వార్డ్ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.



## ఎంకెఆర్ డిగ్రీ కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్య వారోత్సవాలు

విజేత, దేవరకొండ : మునగాల కొండల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ దేవరకొండలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో హెల్త్ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఆర్.రాజేష్ మెడికల్ ఆఫీసర్ పి.హెచ్ సి చందంపేట హాజరై పరిశుభ్రత కాలానుగున వ్యాధులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మానసిక ఒత్తిడి అనే అంశం పైన విస్తృతమైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ డాక్టర్ ఆర్.రాజేష్ మానసిక ఒత్తిడి గురించి, నిద్రలేమి సమస్యల గురించి, ఆహారపు అలవాట్ల గురించి చాలా చక్కగా అవగాహన కల్పించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి.లింగారెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె. పృథు ,ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ వి.మకట్లాల్, డాక్టర్ ఎం.ప్రభాకర్, డాక్టర్ కె. రేణుక తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు




## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుంది

విజేత, తుర్కపల్లి : తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో తల్లిదండ్రు లు ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని ప్రైవేట్ పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అని ఎంఈఓ మంజూష రాణి జిల్లా కమ్యూనిటీ ఆఫీసర్ పెసరు లింగారెడ్డి సర్పంచ్ బానోత్ బూలి వీరన్న నాయక్ అన్నారు విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలకు పంపి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. పాఠశాలల బలోపేతానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. అనంతరం ఎఫ్ ఆర్ ఎస్ పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో అత్యధిక రోజులు హాజరైన విద్యార్థిని విద్యార్థులను రాష్ట్ర విద్యాశాఖ తరపున ప్రశంసా పత్రాలను అందజేశారు .ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కూరేళ్ల నాగరాజు, ఉపసర్పంచ్ ప్రేమలత, మాజీ సర్పంచ్ ఇమ్మడి మల్లప్ప, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు




## పాములపర్తిలో ర్యాలీగా బడిబాట కార్యక్రమం

విజేత గజ్వేల్ : మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలో గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లతీ సైదా సర్పంచ్ భవాని బాలకిషన్,ఉపసర్పంచ్ జుట్టు సుధాకర్,వార్డు సభ్యులు,ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి గ్రామ వీధుల గుండా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.పిల్లల తల్లిదండ్రులకు కరపత్రాలు పంపిణీ చేసి ప్రైవేట్ స్కూల్ వద్దు ప్రభుత్వ స్కూలు ముద్దు అంటూ నినాదాలు చేశారు.విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు దిశగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 21 వస్తువులతో కూడిన స్పెషల్ కిట్ గురించి తల్లిదండ్రులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్య చిన్న బోయిన మల్లేశ్,మ్యాకల శ్రీనివాస్,నిరుడి రాజు,కొండనోళ్ళ నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## అభిమానుల మధ్యలో పెళ్లిరోజు జరుపుకున్న పిఎంఆర్

విజేత, సంగారెడ్డి ప్రతినిధి : జనం మెచ్చిన నాయకుడు, జన శ్రామికుడు, అన్న అంటే నేను అన్నా అనే నాయకుడు, పెళ్లిరోజు వేడుకలను అభిమానుల మధ్యలో జరుపుకున్న నాయకుడు పీఎంఆర్. పెళ్లిరోజు సందర్భంగా పులిమామిడి రాజు మమత దంపతులకు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మరియు సంగారెడ్డి నియోజకవర్గంలోని ప్రజలు వివిధ ప్రాంతాలలో పిఎమ్ఆర్ పెళ్లిరోజు వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించుకున్నారు.పీఎంఆర్ అభిమానులు మందిరంలలో పీఎంఆర్ దంపతుల పేరు మీదుగా పూజలు నిర్వహించి అనంతరం వారి పేరు మీదుగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంఆర్ అభిమానులు మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గంలోనీప్రజలకే కాకుండా వివిధ ప్రాంతాల వారికి కూడా ఆర్థిక సహాయ సహకారాలు చేసిన వ్యక్తి పీఎంఆర్ అని, అభిమానుల అండగా ఏ రాత్రిలో ఫోన్ చేసిన కూడా స్పందించే నాయకుడని, అభిమానుల కోసం పరితపించే వ్యక్తి అని అభిమానులు వ్యక్తం చేశారు.





విజేత
ఆదిలాబాద్
ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్,
కొమురంభీం ఆసిఫాబాద్

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయండి..! - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



విజేత, మామడ : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఆలస్యం చేయవద్దని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్, మండలాల వారిగా అనుమతులు లభించిన ఇండ్లు, ప్రారంభించిన నిర్మాణాలు, అటవీ నిబంధనల వల్ల ఆగిన ఇండ్లు, తదితర అంశాలు సమీక్షించారు. తమ పరిధిలో ఉన్న అటవీ అంశాల పరిష్కారానికి అటవీ అధికారులు కృషి చేయాలన్నారు. ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి దరఖాస్తులు పరిశీలించి, అర్హత ఉన్న దరఖాస్తులను పై దశకు పంపించాలని అన్నారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురవుతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి, ఇండ్ల నిర్మాణాలు వెంట వెంటనే పూర్తి చేసేలా వారిని ప్రోత్సహించాలని తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, ఖానాపూర్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి రేవంత్ చంద్ర, హౌసింగ్, ఫారెస్ట్ అధికారులు, ఎంపీడీవో లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జల్ జంగల్ జమీన్ కోసం గర్జించిన తుడుం దెబ్బ

- **హన్మకొండ మహాసభకు ఆదివాసీలను భారీగా తరలిరావాలని పిలుపు.**
- **పోడు భూములు, 1/70 చట్టం, పేసా అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్న నాయకులు.**



విజేత, బజార్ హత్నూర్ ప్రతినిధి : ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలకేంద్రంలో ఆదివాసీల హక్కులు, భూములు, అస్తిత్వ పరిరక్షణ కోసం మరోసారి తుడుం దెబ్బ గళమెత్తింది. జల్ జంగల్ జమీన్ మా జన్మహక్కు అంటూ ఆదివాసీ సమాజం హక్కుల సాధన కోసం ఐక్య పోరాటానికి సిద్ధమవుతోందని తుడుం దెబ్బ నాయకులు స్పష్టం చేశారు. మే 17న హన్మకొండలో నిర్వహించే తుడుం దెబ్బ ఐక్యత మహాసభ ను చారిత్రాత్మకంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బజార్ హత్నూర్ మండల కేంద్రంలోని నిర్వహించిన పోస్టర్ విడుదల చేశారు.తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయిక సుదర్శన్ మాట్లాడుతూ, అడవిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని తీవ్రంగా విమర్శించారు. అడవి, భూమి, నీరు ఆదివాసీల జీవనాధారమని, వాటిని కాపాడుకోవడం కోసం తుడుం దెబ్బ పోరాటం మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. పోడు భూముల సమస్యపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవడంలో విఫలమైందని ఆయన మండిపడ్డారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములకు ఇప్పటికీ పట్టాలు ఇవ్వకుండా ఆదివాసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అడవుల్లో నివసించే గిరిజనులను కేసుల పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో అమలులో ఉండాల్సిన 1/70 చట్టం కేవలం కాగితాలకే పరిమితమైందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివాసీల భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోతున్నా ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోందని విమర్శించారు.పేసా చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి గ్రామ సభలకు అధికారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని, నిజమైన ఆదివాసీల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఆదివాసీల అస్తిత్వాన్ని కాపాడే వరకు పోరాటం ఆగదని తుడుం దెబ్బ నాయకులు హెచ్చరించారు. తుడుం దెబ్బ అంటే ఆదివాసీ గుండె చప్పుడు అది మోగితే అడవి బిడ్డలంతా ఒక్కటవుతారు అంటూ నాయకులు నినదించారు. హన్మకొండ మహాసభ ఆదివాసీల ఐక్య శక్తికి ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి గ్రామం నుంచి మహిళలు, యువత, పెద్దలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయిక సుదర్శన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నైతం రమేష్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు, గ్రామ పటేల్లు, మేధావులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణాలను చేపట్టేలా చర్యలు తీసుకోవాలి - ఎం ఎల్ ఏ గండ్రసత్యనారాయణ రావు..



విజేత, జయశంకర్ భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం,ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా, ఇల్లు మంజూరై నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారుల అంశాలపై గృహ నిర్మాణ శాఖ, మున్సిపల్, ఎంపీడీవోలు తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎటువంటి ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఇండ్లు మంజూరై నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జూన్ 2న మాస్ ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశాలు నిర్వహించాల్సి ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించారు. అలాగే గృహ నిర్మాణ శాఖకు చెల్లించాల్సిన ఉపాధి హామీ పథకం నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని డిఆర్డీఓకు సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, గృహ నిర్మాణ శాఖ డిఈ శ్రీకాంత్, ఎంపీడీఓలు, గృహ నిర్మాణ శాఖ ఏఈలు డీఈలు తదితరులు పాల్గొన్నారు.

## గవర్న్ మెంట్ ఖాజీ ముఫ్తీ మెహబుబ్ ఖాన్ పై కేసు నమోదు




విజేత, నిజామాబాద్ ప్రతినిధి : తన భర్తతో విడాకులు జరుగకున్న విడాకులు అయినట్టు సర్టిఫికేట్ జారీ చేసి అతను రెండో పెళ్లి చేసుకోవాడానికి కారకుడయ్యాడని మహిళ ఇచ్చిన పిర్యాదు మేరకు ప్రభుత్వ ఖాజీపై పోలిసులు కేసు నమోదు చేశారు.. వివరాలు ఇలా ఉన్నాయి... నగరంలోని నిజాం కాలనీకి చెందిన సానోబర్ ఖానం అనే మహిలకు నాగారంకు చెందిన కార్ మెకానిక్ షేక్ షహబుద్దిన్ తో 2024 జనవరి 4న వివాహం జరిగింది. పెళ్లయిన కోన్ని రోజులకే భర్తతో పాటు ఆమే కుటుంబ సభ్యులు అధనపు కట్నం కోసం వేదించడంతో 2024 నవంబర్ 1న మహిళ పోలిస్ స్టేషన్ లో పిర్యాదు చేసింది. పోలిసులు గ్రుహ హింస కేసు నమోదు చేయగా అప్పటి నుంచి సోనాబర్ ఖానం తల్లిగారింటి వద్ద నిజాం కాలనీలో ఉంటుంది. అయితే షాహబుద్దిన్ తనకు తనభార్యతో విడాకులు జరిగినట్టు ఒక పేపర్ ఇవ్వగా దానిని ద్రువికరించిన ప్రభుత్వ ఖాజీ ముఫ్తీ మహభూబ్ ఖాన్ 7 ఫిబ్రవరి 2026న అతనికి రెండవ వివాహం జరిగినట్టు తెలిసిన సోనాబర్ ఖానం గుర్తించి ఆరవ టౌన్ పోలిస్ స్టేషన్ లో పిర్యాదు చేసింది. బాధితురాలి పిర్యాదు మేరకు సోనబర్ ఖానం భర్త షెక్ షాహబుద్ధిన్ తో పాటు అతడికి విడాకులు అయినట్టు ద్రువికరించి రెండవ వివాహం జరిపిన గవర్నమెంట్ ఖాజీ ముఫ్తీ మహభూబ్ ఖాన్ లపై కేసు నమోదు చేశారు పోలిసులు.

## ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోము - ఏలేటి మహేశ్వర్ రెడ్డి



విజేత లక్ష్మణ్ చందా : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం. రైతు (మహా ధర్నా )కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న వరి పంటను కొనుగోలులో నిర్లక్ష్యం చేయరాదని.సమస్య తీవ్రతలను అనుకూలంగా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని హమాలీల లారీల కొరతను ప్రభుత్వం పట్టించుకోని చర్యలు తీసుకోకపోతే 10 వెయిల మందితో మహాధర్నా నిర్వహిస్తానని. బిజెపి శాసన సభపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నియంత్రణ కోసం పొన్కల్ గ్రామంలో జ్యూట్ బ్యాగుల పంపిణీ..



విజేత మామడ : సహజ వనరులతో తయారయ్యే జ్యూట్ బ్యాగుల వాడకం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించవచ్చని అభిప్రాయపడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అడుగు ముందుకేసి మండలంలోని పొన్కల్ గ్రామంలో గ్రామభివృద్ధి కమిటీ, గ్రామస్తులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా గురువారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారు చేయించిన జ్యూట్ సంచులను వారసంత సందర్భంగా కూరగాయల మార్కెట్లో పంపిణి చేస్తూ ప్లాస్టిక్ వాడకం వలన జరిగే అనర్థాలను వివరించారు. వివాహాది వేడుకల్లోమరియు విందు కార్యక్రమాల్లో ప్లాస్టిక్ పాత్రల బదులు స్టీలుపాత్రల వాడకం ద్వారా పర్యావరణ కాలుష్యనివారణకు తమవంతుగా మేలు చేసినవరమౌతమని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామభివృద్ధి కమిటీ అధ్యక్షులు అట్ల ఉమేష్ రెడ్డి, క్యాషియర్ నిమ్మతోట గంగారెడ్డి,స్థానిక నాయకులు మంగు లింగన్న, సల్కం శేఖర్, రెడ్డి నర్సారెడ్డి,వంశీ కృష్ణ,గంగన్న తదితరులు ఉన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ ( SIR) లో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలి - టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి




విజేత, సంగారెడ్డి ప్రతినిధి : కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ( SIR) లో ప్రజలందరూ తప్పక పాల్గొనాలని సూచించారు టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి. సంగారెడ్డి మున్సిపాలిటీ లోని 24 వ వార్డులో SIR పై ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్ డెస్క్ కార్యక్రమం లో ఆమె పాల్గొని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర సవరణ పై అపోహాలు వదిలేయాలని కోరారు. దీనివల్ల ఎవరి ఓటు హక్కు కోల్పొరని అన్నారు. రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నవారికి ఒకటే దగ్గర ఓటు హక్కు పరిమితం అవుతుంది అన్నారు. సమగ్ర సవరణ వల్ల ఓటర్లలో జవాబుదారీతనం, పారదర్శకత పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్ నవాజ్, సోహైల్, బబ్బు , సంగారెడ్డి తహశీల్దార్ జైరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విజేత
మహబూబ్ నగర్
మహబూబ్ నగర్, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల దాడులు

## - నాలుగు ట్రాక్టర్లు పట్టివేత

విజేత, కృష్ణ : మాగనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అడివిసత్యారం పెద్దవాగు వంతెన వద్ద అక్రమ ఇసుక రవాణాపై టాస్క్ ఫోర్స్ , మాగనూరు పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టగా నాలుగు ట్రాక్టర్లు పట్టుబడ్డాయి తెల్లవారుజామున ప్రాంతంలో అడివిసత్యారం పెద్దవాగు వంతెన వద్ద ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ (ఇంజిన్ నెం. TS 06 EU 4720 ను పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్ కమ్ యజమాని వాకిటి శ్రవణ్ కుమార్ (30) కేసు నమోదు చేశారు తెల్లవారు జాము ప్రాంతంలో అదే ప్రాంతంలో ఖాళీ ట్రాక్టర్ (TS 38 A 5387 / ట్రైలర్ TS 06 EX 2190) తో ఇసుక లోడ్ చేయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ గుడిసె అంజప్ప (42), ట్రాక్టర్ యజమాని గుడిసె రాములమ్మ (38), అడివిసత్యారం గ్రామంపై కేసు నమోదు చేశారు అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా కొనసా



గుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మాగనూరు పోలీసులు హెచ్చరించారు.

# చిన్నంబావి మండల కేంద్రంలో పలు హోటల్లో విచ్చలవిడిగా డొమెస్టిక్ సిలిండర్ల వాడకం

విజేత, చిన్నంబావి : చిన్నంబావి మండల కేంద్రంలోని పలు హోటలలో గృహ అవసరాలకు వినియోగించే (డొమెస్టిక్) సిలిండర్లను వ్యాపార సంస్థలకు వినియోగిస్తూన హోటల్ యాజమానులు, గృహ అవసరాలకు వినియోగించే డొమెస్టిక్ సిలిండర్ లను వ్యాపార సంస్థలలో మరియు హోటల్ రెస్టారెంట్లలో వినియోగించడం చట్టం రీత్యా నేరం అని అనేక సందర్భాలలో అధికారులు చెబుతున్న హోటల్ యజమానులు పట్టించుకోవడం లేదు. వ్యాపార సంస్థలలో, హోటల్, ధాబాల యజమానుల్లో ఎలాంటి మార్పు రాలేదు. హోటల్ యజమానులు తప్పనిసరిగా వాణిజ్య (కమర్షియల్) సిలిండర్లను మాత్రమే ఉపయోగించాలని నిబంధనలు ఉన్న, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని సివిల్ సప్లై అధికారులు గతంలో ఎన్నోసార్లు హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సరఫరా వ్యవస్థను సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు కట్టుబడి ఉన్నారని పలుమార్లు అధికారులు చెపుతున్నారు. ప్రజలు ఓటీపీలు రాక సిలిండర్లు సకాలంలో అందక నానక ఇబ్బందులు పడుతుంటే అధిక రేట్లకు బ్లాకులో హోటల్ యజమానులు సిలిండర్లు తీసుకొని వాడుకోవడం జరుగుతుంది. అధిక రేట్లకు సిలిండర్లు బ్లాక్ లో కొనుగోలు చేస్తూ వ్యాపారంలో టిఫిన్లపై అధిక రేట్లు వసూలు చేస్తున్న హోటల్ యజమానులు. వాణిజ్య సంస్థలలో




వ్యాపార సంస్థలలో హోటలలో బార్లలో రెస్టారెంట్లలో డొమెస్టిక్ సిలిండర్లు వాడుతూ వ్యాపారాలు చేస్తున్న యజమానులపై తగు చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేయాలని చిన్నంబాయి మండల ప్రజలు కోరుతున్నారు.

# కరీంనగర్ జిల్లా తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం



విజేత, కరీంనగర్ : ఈరోజు కరీంనగర్ లోని హోటల్ మహతి కాన్ఫరెన్స్ హాల్లో ముఖ్య సమావేశం జరిగింది తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లాలో తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ ను బలోపేతం చేయడం అలాగే రానున్న నెల రోజుల పాటు టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జెండా పండుగను ఘనంగా నిర్వహించాలని తీర్మానం చేయడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు

# పెద్దలింగాపూర్ లోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభం



విజేత ఇల్లంతకుంట : మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో పీటీమ్,బడిబాట కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోయిని తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ గన్నారం వసంత నర్సయ్య, ఉపసర్పంచ్ ఎల్లవేణి రమేష్ గ్రామ కార్యదర్శి తిరుపతి , వార్డు సభ్యులు గన్నారం నరసయ్య హాజరయ్యారు, ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వసంత మాట్లాడుతూ పెద్దలింగాపూర్ గ్రామంలో ఉన్న 6వ తరగతి నుండి 10 వ తరగతి వరకు అర్హత కలిగిన విద్యార్థులు అందరినీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బడికి పంపడానికి కోసం శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా మొదటి అడ్మిషన్ గా వారి కుమార్తె వర్షినిని పాఠశాలలో జాయిన్ చేయడం జరిగిందని తెలిపారు, ఈ సందర్భంగా పాఠశాల హ్యాబిటేషన్ పరిధిలో ఉన్న సిరికొండ, రామోజీపేట, బోటుమీదిపల్లి నుండి కూడా పిల్లలను మన పాఠశాలకు వచ్చేలా ప్రయత్నం చేద్దామని తెలిపారు. పాఠశాల బడిబాట కార్యక్రమంలో మొట్టమొదటి అడ్మిషన్ సర్పంచ్ కూతుర్ని జాయిన్ చేసినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోయిని తిరుపతి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కొట్టే రజిత ఉపాధ్యాయ, ఉపాధ్యాయులందరూ వారికి ప్రత్యేకమైన అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొమ్ము రమేష్ , మంద పద్మలత,ఆలుగొండ ఉమారాణి,కొండ రమేష్, మొదుంపల్లి శ్రీనివాస్, జోగుల పూర్ణిమ, చిలుక రోజా, అంజలి, రికార్డ్ అసిస్టెంట్ చొక్కయ్య, పాఠశాల ఆఫీస్ సవార్డినేట్ నారాయణ, వంట మనిషి బాబు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సందీప్ రెడ్డి, ఉపాధ్యాయులు లలిత, సునీత,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మడేలేశ్వర స్వామి బోనాల జాతర



విజేత ఇల్లంతకుంట : మండలములోని రేపాక గ్రామములో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా రెండు రోజుల పాటు అంగ రంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుంది అని రజక సంఘం అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్,సభ్యులు రాచకొండ శ్రీనివాస్ తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం నుండి శ్రీ మడేలేశ్వర స్వామి మూడో వార్షికోత్సవం సందర్భంగా బోనాల జాతర మహోత్సవం నిర్వహించడం జరుగుతుంది అని గురువారం పోచమ్మ బోనాలు శుక్రవారం శ్రీ మడేలేశ్వర స్వామి వారి బోనాలు తీయుట జరుగు కాబట్టి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రలు కావాల్సిందిగా కోరడు మైనది అని అన్నారు, ఈకార్యక్రమంలో రజక సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాల పంపిణీ ఘనంగా గణ సన్మానం!!




GOVERNMENT OF TELANGANA
SCHOOL EDUCATION DEPARTMENT
TELANGANA RISING
CERTIFICATE OF APPRECIATION
This is to proudly recognize
SMT/SRI V.SANTHOSH KUMAR
HM / Teacher / Staff at ZPHS CHANDI, SHIVAMPET, MEDAK DISTRICT
For demonstrating outstanding regularity by maintaining over 90% attendance and exhibiting a high level of commitment to duty. With remarkable regularity and perseverance, you have been present on nearly every working day, setting a commendable example for students and fellow educators alike. Your commitment significantly contributes to fostering a culture of discipline, continuity, and excellence within the school community.
Dr. E. Naveen Nicolas, IAS.
Director of school Education & State Project Director

విజేత, శివంపేట : శివంపేట మండలంలో 2025-26 విద్యా సంవత్సరం లో అత్యధిక హాజరు కనబరిచిన ఉపాధ్యాయులకు శివంపేట మండల విద్యాశాఖ అధికారి బుచ్యా నాయక్ ప్రశంసా పత్రాలు అందించి శాలువా తో ఘనంగా సన్మానించారు.రాష్ట్ర ప్రభుత్వం గత విద్యా సంవత్సరంలో ప్రవేశపెట్టిన ముఖ గుర్తింపు హాజరు ఎఫ్ఆర్ఎస్ విధానంలో అత్యధికంగా హాజరు నమోదైన ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలాస్ ఐఏఎస్ ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు.వీటిని శివంపేట్ మండల విద్యాశాఖ అధికారి ఆయా ఉపాధ్యాయులకు అందించడం జరిగింది. భవిష్యత్తులో కూడా ఇలాగే అత్యుత్తమ హాజరు కనబరిచి అత్యుత్తమ విద్యా బోధన చేసి ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఎంఈఓ అభిప్రాయపడ్డారు అత్యధిక హాజరు కనబరిచిన ఉపాధ్యాయులు వరగంటి సంతోష్ కుమార్ ఎస్ ఎ సోషల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చండి, గౌరీ శంకర్ ఎస్ఏ మ్యాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దొంతి, సాయిరాం ఎస్ ఏ తెలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దొంతి,మెట్టు శేఖర్ ఎస్ జి టి ప్రాథమిక పాఠశాల శివాలయ నగర్ గద్వాల అభిలాష్ ఎస్ జి టి ప్రాథమిక పాఠశాల తిమ్మాపూర్ ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ లు రవీందర్ , అంజ్య ఎం ఐ ఎస్ హరికృష్ణ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శివంపేట్ ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో భాగంగా పుస్తక ప్రదర్శన

## - శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం

విజేత, పెద్ద శంకరంపేట్ : ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేట ప్రభుత్వ గ్రంథాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ వి. సుజాత తెలిపారు. విద్యార్థులు, యువత, పాఠకుల్లో పఠనాసక్తి పెంపొందించడం, గ్రంథాలయ వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రదర్శనలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో పాటు సాహిత్యం, చరిత్ర, విజ్ఞాన శాస్త్రం, వ్యవసాయం, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పలు గ్రంథాలను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను ప్రత్యేకంగా ప్రదర్శించనున్నట్లు చెప్పారు.గ్రామీణ ప్రాంతాల్లో చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని, విద్యార్థులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె




సూచించారు. పాఠకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విజేత
నిజామాబాద్
నిజామాబాద్, కామారెడ్డి

# ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

**- మండల కేంద్రంలో ఉపాధ్యాయులు ,విద్యార్థుల బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ**

విజేత, ఏర్గట్ల: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికలే లక్ష్యంగా పిఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ ఏర్గట్ల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఏర్గట్ల లో ర్యాలీ నిర్వహించారని ప్రధానోపాధ్యాయుడు కొమరగిరి కృష్ణచారి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివితే కలిగే ప్రయోజనాలను స్థానికులకు పాఠశాల బృందం వివరించినట్లు తెలిపారు. ఇంటింటికి వెళ్లి పాఠశాలకు సంబంధించిన కరపత్రాలు పంచామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు ఉచితంగా అందిస్తున్న విషయాన్ని గ్రామస్తులకు పాఠశాల బృందం వివరించింది. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకే పంపించాలని విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ పాఠశాలల గొప్పతనాన్ని తెలియజేసేలా విద్యార్థులు ర్యాలీలో చేసి న నినాదాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునీరుద్దీన్, ప్రసాద్, రాజశేఖర్, సమిత, ఎస్ శ్రీనివాస్, విజయ్,




గంగాధర్, ప్రవీణ్ కుమార్, రాజేందర్, కే శ్రీనివాస్, నరేష్, గంగా మోహన్, కోమలి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం



విజేత, ఏర్గట్ల: పీఎం శ్రీ జెడ్పిహెచ్ఎస్ ఏర్గట్ల లో పదవ తరగతి విద్యార్థుల ఉత్తమ ప్రతిభను అభినందిస్తూ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన తొలి పది మంది విద్యార్థులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టాపర్ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారని ప్రధాన ఉపాధ్యాయులు కొమరగిరి కృష్ణాచారి తెలిపారు.ఈ సందర్భంగా ఏర్గట్ల గ్రామ సర్పంచ్ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, అమ్మదర్శ పాఠశాల చైర్మన్ నాగరాణి, వి డి సి ప్రెసిడెంట్ ముత్తన్న, క్యాషియర్ నర్సింగ్ చేతుల మీదుగా విద్యార్థులకు శాలువాలు అందజేసి సన్మానించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. సన్మానం అందుకున్న వారిలో స్కూల్ టాపర్ వైష్ణవి, సందీప్, నిఖిత, రిష్వంత్, అనుష్క, అక్షర, ఆయేషా సిద్దిక, శృతి, రవీనా ఉన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునీరుద్దీన్, ప్రసాద్, రాజశేఖర్, సమిత, ఎస్ శ్రీనివాస్, విజయ్, గంగాధర్, ప్రవీణ్ కుమార్, రాజేందర్, కే శ్రీనివాస్, నరేష్, గంగా మోహన్, కోమలి తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్

**- గిడ్డంగుల వద్ద ఆన్ లోడింగ్ ప్రక్రియ పరిశీలన**

విజేత, నిజామాబాద్ ప్రతినిధి : మోపాల్ మండలం శ్రీరాంనగర్ తండాలో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం తనిఖీ చేశారు. నిజామాబాద్ రూరల్ మండలం శ్రీనగర్ శివారులోని గోడౌన్ ను సైతం కలెక్టర్ సందర్శించారు. ముందుగా కొనుగోలు కేంద్రంను తనిఖీ చేసి, రైతులకు అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. మొక్కజొన్న పంట నాణ్యత, తేమ శాతంను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్ ద్వారా తూకం సరిగా చేస్తున్నారా లేదా అన్నది గమనించారు. ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు పూర్తయ్యింది, ఇంకా ఎంత పరిమాణంలో పంట సేకరణ జరగవలసి ఉన్నదని తదితర వివరాలు అడిగి తెలుసుకుని, అధికారులకు సూచనలు చేశారు. రైతులు పంట ఉత్పత్తులు కేంద్రానికి తెచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటే వెంటనే తూకం వేయించాలన్నారు. సేకరించిన పంటను వెంట వెంటనే గోడౌన్లకు తరలించాలని ఆదేశించారు. అకాల వర్షాలు కురిస్తే ఇబ్బందులు



తలెత్తే ప్రమాదం ఉన్నందున త్వరితగతిన మొక్కజొన్న నిల్వలను గోడౌన్లకు తరలించి జాగ్రత్తగా భద్రపరచాలని ఆదేశించారు. అవసరమైన సంఖ్యలో హమాలీలను సమకూర్చుకుని, మొక్కజొన్న రవాణాలో జాప్యానికి తావు లేకుండా సరిపడా లారీలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. రైతులకు నిర్దిష్ట గడువు లోపు బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు ఏ దశలోనూ అసౌకర్యం కలగకుండా చూడటం అధికారుల బాధ్యత అని అన్నారు. అనంతరం శ్రీనగర్ లోని గోడౌన్ ను కలెక్టర్ సందర్శించారు. మొక్కజొన్న నిల్వల ఆన్ లోడింగ్ తీరును, మొక్కజొన్న బస్తాలను భద్రపరుస్తున్న



విధానాన్ని పరిశీలించారు. గోడౌన్ లో పూర్తి సామర్థ్యం మేరకు పంటను నిల్వ చేయాలని, పంటకు ఎలాంటి నష్టం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న స్టాక్‌ను త్వరితగతిన తరలించేందుకు తగినన్ని లారీలు, ఇతర రవాణా వాహనాలను వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. పూర్తి పారదర్శకంగా, వేగవంతంగా కొనుగోళ్లను పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రేఖా నాయక్, ఎంపీడీఓ నరేష్, మార్క్ ఫెడ్ సిబ్బంది భాస్కర్ తదితరులు ఉన్నారు.

# అనుమతి లేకుండా అడ్మిషన్లు చేపడుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**- టీఎస్ఎ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాలా**

విజేత, నిజామాబాద్ ప్రతినిధి : అనుమతి లేకుండానే అడ్మిషన్లు చేపడుతున్న పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని టీఎస్ఎ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాలా అన్నారు. ఈ విషయమై గురువారం జిల్లా విద్యాధికారి అశోక్ కుమార్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జ్వాలా మాట్లాడుతూ నగరంలో సుభాష్ నగర్ లో మూడు, వినాయక్ నగర్ లో మూడు, కంఠేశ్వర్ లో రెండు, ఖిల్లా ప్రాంతంలో ఒక స్కూల్ ఎటువంటి అనుమతి లేకుండా నడుపుతున్నారని తెలిపారు. నగరంలో ఎక్కడా చూసినా హోర్డింగ్స్ పెడుతూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తూ ఫీజులు గుంజుతున్నారని అన్నారు. సమ్మర్ క్యాంప్ పేరిట అడ్మిషన్స్ చేపడుతూ విద్యార్థులను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. తక్షణమే ఎటువంటి అనుమతి లేకుండా నడుపుతున్న ఈ 9 పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆమె డీఈఓ ని కోరారు. దీనిపై స్పందించిన డీఈఓ తక్షణమే ఆ పాఠశాలలకు నోటీసులు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు.



# ఆగని బాల్య వివాహాలు

**- పల్లెల్లోనే ఎక్కువ..**




విజేత,బాన్సువాడ : కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం లో బాల్య వివాహాలు ఆగడం లేదు. చిన్న వయస్సులో వివాహాలు చేయవద్దని అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నప్పటికీ మైనర్‌లకు వివాహాలు చేస్తున్నారు. మండలంలో బాల్య వివాహాలు ఆగడం లేదు. చిన్న వయస్సులో వివాహాలు చేయవద్దని అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నప్పటికీ మైనర్‌లకు వివాహాలు చేస్తున్నారు. కొన్ని పెళ్లిళ్లు గుట్టు చప్పుడు కాకుండా జరిపేస్తుండగా, మరికొన్ని ఆర్భాటంగా చేసేస్తున్నారు. ఎవరైనా అధికారులకు సమాచా రం ఇస్తే నిలిచిపోతున్న వివాహాలు ఎన్నో ఉన్నాయి. ఉన్నత చదువులు చదవి భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాల్సిన వయస్సులో పుత్తడి బొమ్మలుగా మారి పుస్తెల తాళ్లు మెడలో వేసుకుంటున్నారు. కొందరు తల్లిదండ్రులు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేస్తే తమ బాధ్యత తీరిపోతుందని ఆలోచించడం, ఆర్థిక ఇబ్బందులు, అవగాహణ లోపం, మేనరికాలు, కొన్ని కులాల్లో ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉండడం వంటివి బాల్య వివాహాలకు కారణంగా ఉంటున్నాయి. ఎక్కువగా మారుమూల గ్రామాల్లో జరుగుతున్నాయి. బాల్య వివాహాలను అరికట్టడానికి ఐసీడీఎస్ అధికారులు,ఉద్యోగులు పట్టించుకోవడం లేదు.

# గ్రామంలో జోరుగా పేకాట

- **సరదాగా మొదలై..ఆ తర్వాత బానిసై జేబులు గుల్ల**
- **ఆకర్షితులవుతున్న యువకులు**
- **ఛిద్రమవుతున్న కుటుంబాలు**



విజేత: బాన్సువాడ : బీర్కూర్ మండలంలో పేకాట జోరుగా సాగుతున్నది.సరదాగా మొదలై..ఆ తర్వాత బానిసై జేబులను గుల్లచేస్తున్నది. విచ్చలవిడిగా పెరిగిన ఈసంస్కృతి, ఇప్పుడు మండల కేంద్రాలు, గ్రామాల్లోకి సైతం వ్యాపించింది. యువత కూడా బానిసలవడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. పట్టుబడితే సాధారణ కేసుల కారణంగా పేకాటకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నది.దీంతో రోజురోజుకూ కేసుల సంఖ్య పెరుగుతున్నది.పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు

# మండల వ్యాప్తంగా బడిబాట

**- ఎమ్.ఈ.ఓ. ఆనంద్ రావు**

విజేత, ఏర్గట్ల: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాల సందర్భంగా 4 వ రోజు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం , పి టి ఏం సమావేశాలు నిర్వహించడం జరిగిందనీ మండల విద్యాశాఖ అధికారి ఆనంద్ రావు తెలిపారు. మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో గ్రామ సర్పంచ్ లు , అమ్మ ఆదర్శ పాఠశాలల ఛైర్మన్ లు , ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ర్యాలీలు నిర్వహించారనీ అన్నారు. పదవ తరగతి విద్యార్థులకు సన్మానం, బహుమతులు ప్రధానం చేశారని మండల విద్యాధికారి బి. ఆనంద్ రావు పత్రికా ప్రకటనలో తెలిపారు.

# పేదలపై హత్యాయత్నం చేసి మరీ ఇళ్ళు కూల్చుతారా..?

- కాళ్ళు, చేతులు విరిగిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం ప్రభుత్వమే అందించాలి.
- రెవెన్యూ, పోలీసులు కర్కశంగా వ్యవహరిస్తున్నారు.
- పేదల ఇళ్లతో పాటు భావముల గెస్ట్ హౌస్ లు, ఆక్వా షెడ్లు ఎందుకు తొలగించలేదు?
- సిపిఎం జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి.గోపాలన్ ఆగ్రహం.



విజేత, భీమవరం : పేదలపై హత్యాయత్నం చేసి మరీ ఇళ్ళు కూల్చారని, కాళ్ళు, చేతులు విరిగిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం ప్రభుత్వమే అందించాలని, అధికార పార్టీకి తొత్తులుగా ఉండి రెవెన్యూ, పోలీసులు కర్కశంగా వ్యవహరిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి.గోపాలన్ ఆగ్ర హం వ్యక్తం చేశారు.13వ తేదీన ఉణుదుర్రు గ్రామంలో పేదల ఇళ్ళు కూల్చిన ఘటనలో క్షతగాత్రులు గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి.గోపాలన్, ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్య నారాయణ తో కలిసి బాధితులను పరామర్శించారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జేఎన్వి గోపాలన్ మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో ఎమ్మెల్యే రఘురామ కృష్ణం రాజు వైఖరి దుర్మార్గంగా మరింత పెరిగిపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉండి మండలంలో ఉణుదుర్రు గ్రామంలో ఏళ్ల తరబడి నివసిస్తున్న పేద ప్రజల ఇళ్లను ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా అన్యాయంగా కూల్చేశారని మండిపడ్డారు. పేదలు కొన్ని రోజులు అవకా శం ఇవ్వండి అన్ని సామాన్లు సర్దుకుంటామని చెప్పినా వినకపోవడం అన్యాయమన్నారు. కొంతమంది ఇళ్ళు విప్పుకుంటుంటే కూడా ఆగకుండా జేసీబీ తో భయభ్రాంతులకు గురిచేసి దౌర్జన్యంగా పడగొట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ, పోలీసులు అధికారులు అత్యంత కర్కశంగా పేదలపై విరుచుకు పడ్డారని తెలిపారు. జేసీబీ తో దౌర్జన్యం చేయడం వలనే శాలిమట్ల పెద్దిరాజు కు కాలు విరిగిపోయింది ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు పోయినా, అడ్డుపడిన వారిని హత్యాయత్నం చేసి మరీ ఇళ్ళులు కూల్చడం దుర్మార్గమన్నారు. ఎమ్మెల్యే రఘురామ కృష్ణం రాజు వైఖరి రాముడు పేరు పెట్టుకుని రావణాసురుడులా ఉందని ప్రజలంతా భావిస్తున్నారని చెప్పారు. రావణ పాలనలో పేదల పొట్ట కొట్టి పెద్దోళ్ళకు పెట్టడమే అని అందుకు ఉదాహరణ ఉనుదుర్రు ఘటన అన్నారు. అధే గ్రామంలో ప్రజల ఇళ్ళు కూల్చిన చోటే భూస్వాముల గెస్ట్ హౌస్ లు, ఆక్వా చెరువుల షెడ్లు ఉన్నాయని వాటిని ఎందుకు పడగొట్టలేదని ప్రశ్నించారు. కేవలం అధికార అహంకారంతో భూస్వాములకు మేలు చేయడం కోసమే ఆధిపత్య కులాహంకరంతో పేదల ఇళ్ళు కూల్చేశారని మండిపడ్డారు. తక్షణం పేదలకు 3సెంట్లు స్థలంలో ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని, కూల్చిన ఇళ్ళకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యేపై అనుచిత పోస్టులు

## - జనసేన నేతల ఫిర్యాదు



విజేత (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్‌ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. నియోజకవర్గ జనసేన నాయకులు నీలపాల దినేష్ ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు స్థానిక టౌన్ రూరల్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఫేస్‌బుక్‌లో 'నవీన్ కుమార్ గౌడ్' అనే డిజిటల్ క్రియేటర్ ఐడి కలిగిన వ్యక్తి, నిరంతరం జనసేన పార్టీ అధ్యక్షులపై, నాయకులపై కార్యకర్తలపై అసభ్యకర రీతిలో పోస్టులు పెడుతూ, వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని సీఐ రవికుమార్ గారికి వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధిలో ముందుంటూ అందరిచేత 'జనసేన బాహుబలి' అని పిలిపించుకునే బొలిశెట్టి శ్రీనివాస్ ఎదుగుదలను ఓర్వలేకనే కొందరు ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాజకీయ విభేదాలు ఉండటం సహజమని, కానీ వ్యక్తిత్వ హననానికి పాల్పడటం మరియు సంస్కారహీనంగా ప్రవర్తించడం చట్టరీత్యా నేరమని వారు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో హద్దులు దాటి ప్రవర్తించే వారిని ఉపేక్షించబోమని, నిందితుడిపై తక్షణమే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రామిశెట్టి సురేష్‌తో పాటు నీలపాల దినేష్ యాదవ్, పుల్లా బాబి, కేశవబట్ల విజయ్, అత్తిలి బాబి, బైనపాలెపు ముకేష్, మద్దాల నరసింహ, కొనకళ్ల హరినాథ్, కామిశెట్టి శ్రీనివాస్, అంగిన హరికృష్ణ, వాకా నాని, దంగేటి సత్యనారాయణ నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# భీమవరం ప్రభాస్ అభిమానుల ఆద్వర్యంలో చలివేంద్రం






విజేత, భీమవరం : సేవ గుణానికి మరో పేరు మన రెబల్ స్టార్ ప్రభాస్ ఆదర్శంగా తీసుకుని ప"గో జిల్లా భీమవరం లో ప్రభాస్ అభిమానులు ఆద్వర్యం లో చలివేంద్రం ను ఘనంగా ఏర్పాటు చేశారు.అనంతరం ప్రభాస్ ఫ్యాన్స్ టౌన్ వైట్ ప్రెసిడెంట్ ఉండి వాసు మాట్లాడుతూ రాజు ఎక్కడున్నా రాజే ప్రభాస్ ఆయన దాన గుణానికి స్నేహానికి ఇచ్చే విలువ అది మాటల్లో చెప్పలేం ఎదుటి వారిని అతిథి మర్యాదలతో గౌరవించడం అనేది పూర్వం నుండి రాజుల్లో ఉండే ఒక సాంప్రదాయం చిన్న పెద్ద తారతమ్యం లేకుండా ఒక స్టార్ ఇమేజ్ ని కూడా పక్కనపెట్టి ఎదుటి వారికి సాయం చేయడం అలాగే వారిని ప్రేమించడం మన డార్లింగ్ ప్రభాస్ ని చూసి నేర్చుకోవాలని వారు తెలిపారు. అలాగే రెబల్ స్టార్ ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో వేసవికాలం ఎండ తీవ్రతలకు తట్టుకునే విధంగా తోటి ప్రయాణికులకు మరియు పాదచారులకు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది అనంతరం బ్యాటరీ షాప్ యజమాని మహమ్మద్ ఉమర్ మాట్లాడుతూ ఈ చలివేంద్రంలో 1000 లీటర్ల పెరుగు అలాగే 50 కేజీల పంచదార మరియు 50 టిన్నుల మంచినీరు తో లస్సిని మా ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ తరపున ఏర్పాటు చేయడం జరిగిం దని వారు తెలిపారు కార్యక్రమంలో ఉండి.వాసు, పెచ్చేటి ప్రసాద్, మహమ్మద్ ఉమర్ కే.జగదీష్ పి.కేశవ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు కలగకుండా

## పారదర్శకంగా, వేగవంతంగా రీ-సర్వే పూర్తి చేయాలి



విజేత, యలమంచిలి : రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, వేగవంతంగా రీ-సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికా రులను ఆదేశించారు.గురువారం యలమంచిలి మండలంలోని ఇలపకుర్రు గ్రామాన్ని సందర్శించిన జాయింట్ కలెక్టర్ గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే పనుల పురోగతిని పరిశీలించారు. భూముల సర్వే, సరిహద్దుల నిర్ధారణ, భూ వివరాల నమోదుపై అధికారు లతో సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు.అనంతరం ఏనుగువానిలంక గ్రామంలో నిర్వహిస్తున్న గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. రైతు భూమి సరిహద్దులను గుర్తించి, స్వయంగా రైతు ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి దశలో పారదర్శకత పాటిస్తూ రీ-సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా మరియు కోనసీమ జిల్లా మధ్య ఉన్న సరిహద్దు ప్రాంతాన్ని పరిశీలించి తగిన సూచనలు చేశారు. అలాగే ఇలపకుర్రు గ్రామ పరిధిలోని పెరుగులంక భూములను పరిశీలించి, ఆ భూములకు సంబంధించి తీసుకో వాల్సిన చర్యలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు.అనంతరం లక్ష్మీపాలెం గ్రామంలోని పంట పొలాలను సందర్శించి ధాన్యం రాశులను పరిశీలించారు. ఇంకా ధాన్యం పట్టుబడి జరగకపోవడానికి గల కారణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.లక్ష్మీపాలెంలో పుష్కర్ ఘాట్ నిర్మాణానికి ప్రతిపాదించిన ప్రదేశాన్ని పరిశీలించి, సంబంధిత నిర్మాణ ప్రతిపాదనలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం యలమంచిలిలోని మారుతి సోమేశ్వర రైస్ మిల్లును తనిఖీ చేసి, ధాన్యం బస్తాలతో వచ్చిన ట్రాక్టర్లలో లోడ్లు దిగుమతి కాకపోవడానికి గల కారణాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.జాయింట్ కలెక్టర్ వెంట రెవెన్యూ డివిజనల్ అధికారి దాసిరాజు, జిల్లా భూ సర్వే అధికారి కె.జాషువా, తహసీల్దార్ జి.ఎన్.వి. పవన్ కుమార్, ఆర్.ఎస్.డి.టి పి.డేవిడ్సన్, సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా రంగాన్ని కుప్పకూల్చుతున్న కూటమి ప్రభుత్వం



విజేత, భీమవరం : ఆక్వా ఫీడ్ ధరల పెంపు దారుణమని, కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులను నిలువునా ముంచేస్తుందని, వైఎస్సార్ సిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్రాజుమండిపడ్డారు.భీమవరంలోని వైఎస్సార్ సిపి జిల్లా కార్యాలయం లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ప్రభుత్వ పెద్దలు, ఫీడ్ కంపెనీలు కుమ్మక్కై ఆక్వా రైతులను దోపిడీ చేస్తున్నారని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అసమర్ధ పాలన వల్ల ఆక్వా రంగం అత్యంత దయనీయ స్థితికి చేరుకుందన్నారు. తక్షణమే ధరలు తగ్గించాలని లేని పక్షంలో ఆక్వా రైతులతో కలిసి ఆందోళన చేపడతా మని హెచ్చరించారు.ఫీడ్ ధరలపై సుంకాలు తగ్గినప్పుడు టన్నుకు రూ 25 వేలు తగ్గించాల్సిన ప్రభుత్వం, కేవలం రూ 4 వేలు తగ్గించి చేతులు దులుపుకుందన్నారు. ప్రతి నెలా ఫీడ్ కంపెనీల నుంచి ప్రభుత్వ పెద్దలకు ముడుపులు అందుతున్నాయని, అందుకే ధరల పెంపును అడ్డుకోలేదని విమర్శించారు. యూనిట్ విద్యుత్ కి రూ1.50 సబ్సిడీ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, రెండేళ్లు కావస్తున్నా పైసా సబ్సిడీ ఇవ్వలేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో 50,800 ఆక్వా కనెక్షన్లకు ఐదేళ్లలో రూ 3,640 కోట్లు సబ్సిడీగా ఇస్తే నేడు ఒక్క కొత్త కనెక్షన్ కూడా ఇవ్వకుండా సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ అంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు.ఎమ్మెల్సీ కావూరు శ్రీనివాస్, భీమవరం, ఉండి ఇన్ ఛార్జ్ లు చినిమిల్లి వెంకట్రాయుడు, పివిఎల్ నరసింహరాజు, పార్లమెంట్ ఇన్ ఛార్జ్ గూడూరి ఉమాబాల, మేడిద జాన్సన్, ఏఎస్ రాజు లు మాట్లాడుతూ ఆక్వా ఫీడ్ ధరల వెనుక భారీ స్కాం దాగి ఉందని, తక్షణమే ఫీడ్ ధరలు తగ్గించాలని, లేకపోతే ఆక్వా రైతుల తరపున పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికే కరెంట్, డీజిల్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులపై ఫీడ్ ధరల పెంపు మరో పిడుగుపాటుగా మారిందన్నారు.

# డిప్యూటీ స్పీకర్ రఘురామకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే అంజిబాబు



విజేత, భీమవరం : డిప్యూటీ స్పీకర్ ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు కు రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ డా గంటా త్రిమూర్తులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పెద అమిరంలోని ఆర్ కె కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన వేడుకల్లో కేక్ కట్ చేసి రఘురామకు తినిపించి అభినందనలు తెలిపారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నానన్నారు. అనంతరం డా త్రిమూర్తులు గజమాలతో వారిని సత్కరించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, టిడిపి పట్టణ జాయింట్ సెక్రటరీ యలమంచిలి శ్రీనివాసరావు, కాపా అమర్ బాబు, ముదరకొాల సతీష్ , గొలగాని రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.